నవ ఉషస్సుల ఉగాది వచ్చేసింది..

మామిడాకుల తోరణాలు.. కోకిలమ్మ కిలకిల రావాలు.. మంగళనాదాలు.. వేపపూల వగరు రుచి తెలిపే ఉగాది వచ్చేసింది. తెలుగు సంవత్సరాదికి మంగళవారం ఘన స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. క్రోధి నామ సంవత్సరం సకల శుభాలకు ఆలవాలమని పంచాంగకర్తలు చెబుతున్నారు. సంఖ్యా శాస్త్రపరంగా చూసినప్పటికీ అందరికీ ఎంతో బాగుంటుందని వారు పేర్కొంటున్నారు.

- ఒంగోలు కల్చరల్






మేం సిద్ధంగా లేం..

వైసీపీ ఎమ్మెల్యేలు వేణుగోపాల్, మహీధర్

జగన్ బస్సు యాత్ర, సభకు ఇద్దరూ డుమ్మా

- నెల్లూరులో కలిసి.. కందుకూరులో కనిపించని మానుగుంట
- రేపు దర్శిలో అనుచరులతో వేణుగోపాల్ మంతనాలు





ఆ ఇద్దరూ వైసీపీ తరపున గెలుపొంది ఇప్పటికీ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వారు పోటీ చేసేందుకు జగన్ అవకాశం ఇవ్వలేదు. అయితే ఆయా సందర్భాల్లో తాడేపల్లిలో వారు భేటీ అయినప్పుడు తాను బరిలోకి దించిన అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. ఇప్పటికీ వైసీపీలోనే కొనసాగుతున్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు శని, ఆది, సోమవారాల్లో ఉమ్మడి జిల్లాలో జరిగిన జగన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వీరిలో మహీధర్‌రెడ్డి రాజకీయంగా సైలెంట్ అయ్యే అవకాశం కనిపిస్తుండగా, మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ దర్శిలో టీడీపీ కూటమి అభ్యర్థికి మద్దతిచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మేమంతా సిద్ధం. మీరు సిద్ధమా అంటూ ఊరూవాడా తిరుగుతున్న వైసీపీ అధినేత సీఎం జగన్‌రెడ్డికి ఇద్దరు ఎమ్మెల్యేలు తాము సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. ఆయన నిర్వహించిన సభకే కాక వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో జగన్ నిర్వహిస్తున్న బస్సుయాత్రకు డుమ్మాకొట్టి తమ మనోగతాన్ని చెప్పకనే చెప్పారు. అందులో ఒకరు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కాగా, మరొకరు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి. శనివారం సాయంత్రం కందుకూరులో జగన్ బస్సు యాత్ర సాగగా ఆదివారం సాయంత్రం దొనకొండ అడ్డరోడ్డు వద్ద సీఎం సభ, రాత్రికి దర్శిలో రోడ్‌షో జరిగింది. సోమవారం మధ్యాహ్నం వరకు కూడా ఆయన దర్శి సమీపంలోని చలివేంద్రం వద్ద శిబిరంలో ఉండి నియోజకవర్గ నాయకులను కలిశారు. పింఛన్‌దారులతో కూడా భేటీ అయ్యారు. కందుకూరు బస్సుయాత్రలో మహీధర్‌రెడ్డి కనిపించకపోగా.. దర్శి బస్సుయాత్ర, ఇతర కార్యక్రమాలకు వేణుగోపాల్ డుమ్మాకొట్టారు. తద్వారా రెండు నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపునకు పనిచేసేందుకు తాము సిద్ధంగా లేమని వారు చెప్పకనే చెప్పారు.

నెల్లూరులో కలిసి... కందుకూరులో డుమ్మా


కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి సీఎం జగన్‌ను నెల్లూరు ప్రాంతంలో కలిసినట్లు సమాచారం. అంతకు ముందు ఆయా సందర్భాల్లో తనను కలిసిన నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌లతో కూడా మాట్లాడారు. ఆ ఇద్దరు నాయకులు మహీధర్ వద్దకు వచ్చినప్పుడు అనుచరులను కూడా పరిచయం చేశారు. కానీ నియోజకవర్గంలో ఎక్కడా, ఎప్పుడూ కూడా ఆయన వైసీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో పాల్గొనలేదు. పైగా తనను ఏం చేద్దామని అడిగిన అనుచరులతో వేచి చూడండని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సీఎం ఉన్నప్పుడు మహీధర్‌రెడ్డి కలిసినట్లు తెలిసింది. దీంతో ఆయన కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా పనిచేస్తారన్న ఊహాగానాలు వచ్చాయి. ఆ పార్టీ నాయకులు కూడా అదే అభిప్రాయంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే శనివారం సాయంత్రం జగన్ బస్సుయాత్ర కందుకూరు వచ్చినప్పుడు మహీధర్‌రెడ్డి పాల్గొనలేదు. కందుకూరులో జరిగిన రోడ్డుషోలో జగన్ బస్సు బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేసేటప్పుడు బుర్రా ఉన్నారే తప్ప మహీధర్‌రెడ్డి కనిపించలేదు. దీంతో అంతకు ముందు మహీధర్‌రెడ్డికి, ఇతర నాయకులకు జగన్ ఏం చెప్పారో ఏమోకానీ కందుకూరు కార్యక్రమాలకు మానుగుంట డుమ్మా కొట్టడంతో ఆయన నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే అవకాశం లేదని తేలిపోయింది. కేవలం రాజకీయ విశ్లేషకులే కాక నియోజకవర్గంలోని మహీధర్‌రెడ్డి అనుచరులు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన అసలు వైసీపీలో ఉంటారా? వేరే పార్టీలోకి వెళతారా? అన్న ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. అందుతున్న సమాచారం మేరకు ఈ ఎన్నికల వరకు మహీధర్ రాజకీయంగా సైలెంట్‌గా ఉండవచ్చని తెలుస్తోంది. ఏ పరిస్థితిలోనూ వైసీపీ అభ్యర్థి మధుసూదన్‌కు మద్దతు ఇవ్వడని కూడా బలంగా వినిపిస్తోంది.

రేపు దర్శికి రానున్న మద్దిశెట్టి

వైసీపీ అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో నియోజకవర్గానికి దూరంగా ఉన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం దర్శికి రానున్నారు. ఆమేరకు అధికారికంగానే ఆయన తన అనుచరులకు సమాచారం ఇచ్చారు. తనకు టికెట్ ఇవ్వకపోగా, తాను వ్యతిరేకించే బూచేపల్లిని పోటీలో ఉంచడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే ఆలోచన లేదన్న సంకేతాన్ని గతంలో ఇచ్చారు. ప్రస్తుతం సీఎం కార్యక్రమాలకు దూరంగా ఉండటం ద్వారా ఆయన వైసీపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా లేనని తేల్చిచెప్పినట్లయ్యింది. ఇప్పటికే నియోజకవర్గంలోని మద్దిశెట్టి అనుచరుల్లో కొందరు టీడీపీలో చేరిపోయారు. మరికొందరు రాజకీయంగా సైలెంట్ అయ్యారు. ఇదే సమయంలో అనుచరులతో ఆయన సోదరుడు శ్రీధర్ ఒక సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఆయన టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌తో కూడా భేటీ అయినట్లు తెలుస్తోంది. ముఖ్య అనుచరులకు టీడీపీ అభ్యర్థి గెలుపునకు సహకరిద్దామనే సంకేతం ఇచ్చినట్లు సమాచారం. టీడీపీలో చేరేందుకు కూడా వేణుగోపాల్ సిద్ధమైనట్లు కొందరు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బుధవారం దర్శికి రానుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. నేరుగా అనుచరులతో భేటీ అని చెప్పకుండా తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారన్న సమాచారాన్ని లిఖితపూర్వకంగా నాయకులకు పంపారు. తదనుగుణంగా ఆయనతో భేటీ అయ్యేందుకు అనుచరులు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యే కూడా టీడీపీలో చేరే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. కాకపోయినా అనుచరులకు టీడీపీకి మద్దతు ఇచ్చే సందేశాన్ని ఇవ్వొచ్చని అంటున్నారు. అదేసమయంలో అనుచరుల అభిప్రాయాలకు అనుగుణంగా ముందుకుపోవొచ్చు. అయితే ఆయన కూడా పార్టీ మారతారా? లేక సోదరుడు, అనుచరులు పార్టీ మారేందుకే గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? అనేది బుధవారం తేటతెల్లమయ్యే అవకాశం ఉంది.

తాగునీటికి సాగర్ జలాలు

- డ్యాం నుంచి విడుదల
- 12 నాటికి జిల్లాలోకి వచ్చే అవకాశం



సాగర్ డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదలయ్యాయి. జిల్లాతోపాటు సాగర్ కుడికాలువ కింద ఉన్న గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఐదు టీఎంసీల నీటిని సాగర్ డ్యాం నుంచి ఇచ్చేందుకు కేఆర్‌ఎంబీ అనుమతించింది. తదనుగుణంగా సోమవారం ఈఈ శివశంకరయ్య పర్యవేక్షణలో డ్యాం వద్ద కుడికాలువకు నీటిని విడుదల చేశారు. రోజుకు 5,500 క్యూసెక్కుల ప్రకారం ఈనెల 18 వరకు పది రోజులపాటు వదలనున్నారు. జిల్లా సరిహద్దు కుడి ప్రధాన కాలువ 85/3 వద్దకు ఈనెల 12వ తేదీ నాటికి ఆ నీరు చేరుతుందని అంచనా. కాగా ఈఏడాది డ్యాం నుంచి ఇదే ఆఖరి విడత నీటి విడుదలగా అధికారులు చెప్తున్నారు. కుడికాలువ పరిధిలోని నాలుగు జిల్లాల్లో ఉన్న వందలాది గ్రామాలు, పట్టణాలకు కలిపి కేవలం ఐదు టీఎంసీల నీటిని మాత్రమే కేటాయించడం కొంత ఇబ్బందికరంగానే కనిపిస్తోంది. ఒంగోలుతోపాటు పలు పట్టణాలకు నీరిచ్చే రామతీర్థం డెడ్ స్టోరేజీకి చేరింది. దానికి కనీసం ఒక టీఎంసీ అవసరం. అలాగే రామతీర్థం ఎగువ నుంచి 85/3 వరకు దాదాపు 12 సామూహిక రక్షిత నీటి పథకాలు(సీపీడబ్ల్యూ) స్కీంలకు సంబంధించి ఎస్‌ఎస్ ట్యాంకులు 50 వరకు ఉన్న నోటిఫైడ్ చెరువులకు మరో టీఎంసీ అవసరం. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తే తప్ప ఆయా వనరులకు నీరందే అవకాశం లేదు. కాగా ఇప్పటికే పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించారు. వారంతా అప్రమత్తంగా ఉండి ఎగువ జిల్లాల నుంచి నీరు తెచ్చుకోవడంతోపాటు జిల్లాలోని ఆయా ప్రాంతాలకు తాగునీటి వనరులకు నీటిని సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎక్కడ నిర్లక్ష్యం జరిగినా జిల్లా ప్రజానీకం ఈ వేసవిలో నీటికోసం తీవ్రంగా ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి ఎదురు కానుంది.

స్వల్పంగా పెరిగిన పొగాకు ధరలు

- కిలో రూ.237 పలికిన గరిష్ఠ ధర
- లోగ్రేడ్‌ను అధికంగా తెస్తున్న రైతులు
- ఇప్పటికి 18.90 మిలియన్ కిలోల విక్రయం
- కిలోకు రూ.220 లభించిన సగటు ధర

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్ హాట్‌హాట్‌గా సాగుతోంది. వ్యాపారులు బేళ్ల కోసం పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. నిన్నమొన్నటివరకు గరిష్ఠ ధర కిలో రూ.232కు అటుఇటుగా ఉంటుండగా సోమవారం స్వల్పంగా పెరిగింది. కొండపిలో కిలోకు రూ.237 లభించింది. ఇతర కేంద్రాల్లో రూ.235 లేదా రూ.236 పలికింది. నెల క్రితం దక్షిణాది ప్రాంతంలో పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజున గరిష్ఠ ప్రారంభ ధర కిలోకు రూ.230 ఇచ్చిన వ్యాపారులు అదే ధరను కొనసాగిస్తున్నారు. అదే సమయంలో మంచి ధరలు లభిస్తుండటంతో రైతులు కూడా మేలురకం కన్నా లోగ్రేడ్ పొగాకునే అధికంగా తెస్తున్నారు. ఆ రకం కూడా కిలో రూ.220కి అటుఇటుగా ధర పలుకుతోంది. గతంతో పోల్చితే లోగ్రేడ్ ధరలు ఆశాజనకంగానే ఉంటున్నాయి. అయితే ఈస్థాయి ధర ఎంతకాలం ఉంటుందన్న అనుమానం వ్యక్తం చేస్తున్న రైతులు ప్రస్తుతం విక్రయాలకు మూడొంతుల బేళ్లకుపైగా లోగ్రేడ్‌నే తెస్తున్నారు. ఆ గ్రేడ్‌లో గతంలో పనికిరాక ఎరువుగా దిబ్బల్లో వేసే నల్ల బొగులు రకం మినహా ఇతర రకాలను వ్యాపారులు పోటీపడే కొంటున్నారు. కాగా ఇప్పటివరకు మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.230 నుంచి రూ.233 వరకు ఉండగా సోమవారం మార్కెట్లో స్వల్పంగా పెరిగింది. పలుచోట్ల కిలో రూ.235 నుంచి రూ.236 పలికింది. కొండపిలో రూ.237 లభించింది. ఈ సీజన్‌లో ఇదే గరిష్ఠ ధర కాగా క్రమంగా మార్కెట్ పెరుగుతుందని సమాచారం. ఇదిలా ఉండగా ఇప్పటివరకు దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాల్లో 18.90 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. సగటున కిలోకు రూ.220 ధర లభించింది. పొగాకు మార్కెట్‌లో గుత్తాధిపత్యం వహించే ఐటీసీ వంటి కంపెనీలు గరిష్ఠ ధర కిలో రూ.230 మించకుండా జాగ్రత్త తీసుకుంటున్నాయి. పలువురు డీలర్లు, కొందరు ఎగుమతిదారులు బేళ్ల కోసం పోటీపడుతూ స్వల్పంగా ధర పెంచి కొనుగోలు చేస్తున్నారు. కాగా మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా రైతులు ఆ తరహా బేళ్లను విక్రయాలకు తీసుకురావాలని బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు సూచించారు. నల్లబొగులు వంటి బేళ్లను తీసుకురావద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.



కొండపిలో జరుగుతున్న వేలం

ఎండకు అల్లాడిన పింఛన్‌దారులు

- 11గంటల తర్వాత బయటకు వచ్చిన సీఎం
- సమావేశం తర్వాత పట్టించుకోని వైనం
- ఇబ్బందులు పడుతూ వెళ్లిన వృద్ధులు

దర్శి, ఏప్రిల్ 8 : సీఎం వైఎస్ జగన్ పెన్షన్‌దారులతో సోమవారం నిర్వహించిన సమావేశం వలన ప్రయోజనం ఏమిటని పలువురు పెదవి విరుస్తున్నారు. మండుటెండలో సుదూర ప్రాంతం నుంచి వచ్చి గంటల తరబడి రోడ్లపై వేచి ఉండాల్సి వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్సుయాత్రలో భాగంగా జగన్ ఆదివారం రాత్రి దర్శికి వచ్చిన విషయం విదితమే. మండలంలోని వెంకటాచలంపల్లి వద్ద ఆయన రాత్రి బసచేశారు. అనంతరం సోమవారం ఉదయం పెన్షన్‌దారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో నియోజకవర్గం నుంచి వృద్ధులను, దివ్యాంగులను అక్కడకు తరలించారు. సీఎం జగన్ బస్సులో నుంచి సుమారు 11 గంటల సమయంలో బయటకు వచ్చారు. అప్పటివరకు వృద్ధులు ఎండ, వడగాడ్పుల్లోనే వేచిఉండాల్సి వచ్చింది. సమావేశం వద్ద టెంట్లు వేసినప్పటికీ ఎండతీవ్రత అధికంగా ఉండటంతో అల్లాడిపోయారు. 12 గంటలకు సమావేశం ముగిసింది. అనంతరం వారు గ్రామాలకు వెళ్లేందుకు రోడ్లపై ఎండలో ఎంతో ఇబ్బందిపడ్డారు. బస్సుయాత్ర సమయంలో దర్శితోపాటు మిగిలిన గ్రామాల్లో ఎలాంటి ప్రసంగం చేయని సీఎం జగన్ పెన్షన్‌దారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీ కూటమిపై బురద జల్లే ప్రయత్నం చేశారే తప్ప తమపై ఎలాంటి ప్రేమ లేదని అక్కడికి వచ్చిన వారు చర్చించుకున్నారు. నిజంగా వృద్ధులు, దివ్యాంగులపై అభిమానం ఉంటే ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎండకు ఇబ్బందిపడతారన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంటే అధికారుల ద్వారా పెన్షన్లు ఇళ్ల వద్ద పంపిణీ చేసి ఉండేవారని వారు చర్చించుకున్నారు. వలంటీర్లను పక్కన పెట్టడం వలన ఈ ఇబ్బంది జరిగిందని, ఈ నెపాన్ని టీడీపీపై నెట్టే ప్రయత్నం చేసేందుకే వృద్ధులు, దివ్యాంగులతో సమావేశాలు నిర్వహించి కల్లబొల్లి కబుర్లు చెప్పుకుంటున్నారని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



ఎండలో అవస్థ పడుతూ ఇళ్లకు వెళ్తున్న వృద్ధులు



జగన్ కోసం ఎండలో ఎదురు చూస్తున్న దివ్యాంగులు



సర్వర్ డౌన్.. అందని రేషన్!

- ఎనిమిది రోజుల్లో సగం కార్డుదారులకే సరుకులు
- గంటల తరబడి పడిగాపులు
- రాష్ట్రంలో 24వ స్థానంలో జిల్లా

ఒంగోలు (కలెక్టరేట్), ఏప్రిల్ 8: జిల్లాలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో గంటల తరబడి మొబైల్ వాహనాల వద్ద కార్డుదారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో రేషన్ పంపిణీని ప్రారంభించి సోమవారానికి ఎనిమిది రోజులు గడుస్తున్నా కేవలం 53.58 శాతం మందికి మాత్రమే సరుకులు అందాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా 6,70,571 కార్డులు ఉండగా సోమవారం సాయంత్రం 4.30 గంటలకు 3,59,298మంది కార్డుదారులకు మాత్రమే రేషన్ అందింది. రేషన్ పంపిణీలో రాష్ట్రంలో జిల్లా 24వ స్థానంలో ఉంది. జిల్లాకేంద్రమైన ఒంగోలుతోపాటు అన్ని ప్రాంతాల్లో సర్వర్ డౌన్ అవుతుండటంతో గంటల తరబడి వేలిముద్రలు పడటం లేదు. ఒక్కోసారి వాహనదారులు సర్వర్ పనిచేయక వాహనాన్ని పక్కన పెట్టాల్సి వస్తోంది. గత పది నెలలుగా సర్వర్ డౌన్ అవుతోంది. ఈ విషయాన్ని వాహనాల ఆపరేటర్లు అనేక సార్లు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. ఈనెలలో కూడా ఇదేవిధంగా ఉండడంతో కార్డుదారులకు సకాలంలో రేషన్ అందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంత్రి మేరుగ.. మీకిది తగునా..!

- యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన
- ఎస్‌ఎన్‌పాడు సెగ్మెంట్‌లో పాస్టర్లకు తాయిలాలు
- రూ.వెయ్యి మాత్రమే ఇవ్వడంతో అసంతృప్తి



వివరాలు మెయిన్‌లో..

ఈవీఎంల సీల్ ప్రక్రియలో లోపాలు లేకుండా చూసుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్


వర్క్‌షాపులో మాట్లాడుతున్న దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8 : ఈవీఎంల అను సంధానం, అవసరమైన చోట సీల్ వేసే ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించడంపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ఈ దిశగా ఆర్వోలు, ఏఆర్వోలకు, ఈవీఎం నోడల్ ఆఫీసర్లు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో వర్క్‌షాపును నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో కంట్రోలు యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాడ్‌లకు ఏ విధంగా అనుసంధానం చేయాలో ఎన్నికల సంఘం ద్వారా వచ్చిన వీడియో ప్రదర్శన ద్వారా డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఈ అనుసంధానంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. పోలింగ్ కేంద్రంలో అధికారులకు, రాజకీయ పార్టీల ఏజెంట్లకు సీటింగ్ ఏ విధంగా ఏర్పాటు చేయాలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని, ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించే డెమోను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర నియోజకవర్గాల ఆర్వోలు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.


గిరిజనులతో ఎమ్మెల్యే స్వామి

టీడీపీ అధికారంలోకి రాగానే పేదలకు పెన్షన్ రూ.4 వేలు

- ఒకటో తేదీనే ఇంటికి పంపిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

సింగరాయకొండ, ఏప్రిల్ 8 : టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పేదలకు ఇచ్చే సామాజిక పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచుతామని, ఆ మొత్తాన్ని ఒకటో తేదీనే ఇంటికి పంపిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి గౌదగట్లవారిపాలెం, మల్లికార్జున్‌నగర్ ఎస్టీ కాలనీల్లోని గిరిజలతో సోమవారం రాత్రి ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ బయట ప్రాంతాలకు వెళ్లిన వారికి మూడు నెలల పెన్షన్ ఒకేసారి ఇస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచుతామని తెలిపారు. గతంలో రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేసిన ఘనత చంద్రబాబుదే అని చెప్పారు. గత ఎన్నికల సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3వేలు పింఛన్ ఇస్తానని జగన్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. తీరా ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఎన్నికల ముందు రూ.3వేలు ఇచ్చి అవ్వాతాతలను దగా చేసిన మోసకారి జగన్‌రెడ్డి అని స్వామి విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిపుత్రిక కల్యాణ పథకం కింద గిరిజన యువతుల వివాహానికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తే వైసీపీ ప్రభుత్వం దాన్ని నీరుగార్చిందని మండిపడ్డారు. తమ కాలనీల్లో కొందరికి ఇళ్ల స్థలాలు లేవని స్వామి దృష్టికి గిరిజనులు తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ టీడీపీ అధికారంలోకి రాగానే రెండు సెంట్ల స్థలాన్ని మంజూరు చేయించి అందులో ఇంటిని కూడా నిర్మాణం చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంటను, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ నేతలు చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, సవిడిబోయిన మురళి, కొట్టే జాలయ్య, నరసింహారావు, మోరుబోయిన వంశీ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మాదిగలకు మరింత మేలు

- దామచర్ల జనార్దన్ టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం : ఎమ్మార్పీఎస్ నేతలు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 8 : తెలుగుదేశం పార్టీ హయాంలోనే మాదిగజాతికి మేలు జరిగిందని, ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ కోసం, మాదిగలకు మరింత మేలు చేకూర్చడం కోసం మరింత కృషి చేస్తామని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్‌నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మాదిగల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించింది ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపడం ద్వారా సుమారు 22 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే, పదవులు కేటాయింపు, అన్నీ రంగాల్లో న్యాయం చేసేవిధంగా చంద్రబాబు నాయుడు ఉన్నారని అన్నారు. సైకో ప్రభుత్వాన్ని సాగనంపడానికి సమష్టిగా పనిచేయాలని కోరారు.టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే మాదిగల ప్రయోజనాల కోసం సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి, అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ తొరటి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పనిచేయడంతోపాటు, ఎన్డీయే కూటమిలో భాగస్వామి అయిన టీడీపీ గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ పనిచేస్తుందని తెలిపారు. అలాగే ఒంగోలు అభ్యర్థి దామచర్ల విజయం కోసం పనిచేయడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా అన్నీ నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ తరుపున మాదిగ జాతి పనిచేస్తుందని తెలిపారు. మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేత తిరువూరి బాబు మాదిగ, నేతలు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న దామచర్ల, ఎమ్మార్పీఎస్ నేతలు


ఆరో డివిజన్‌లో ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

అన్ని వర్గాల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

- అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేగా మరో అవకాశం ఇవ్వాలి
- 6వ డివిజన్‌లో దామచర్ల ఇంటింటి ప్రచారం

ఒంగోలు (కార్పొరేషన్) ఏప్రిల్ 8 : అన్నీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు అడుగులు ముందుకు వేస్తున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఒంగోలు టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. సోమవారం నగరంలోని 6వ డివిజన్‌లో దామచర్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, అన్నీ వర్గాల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. మూడు వేలు పింఛన్‌ఇస్తానని అబద్ధాలు చెప్పిన జగన్ రెడ్డి, ఆ మాట నిలబెట్టుకోవడానికి ఐదేళ్ళు పట్టిందన్నారు. విడతలవారీగా పింఛన్ సొమ్ము పెంచి, ప్రజలను మోసం చేసిన వ్యక్తి సైకో జగన్ రెడ్డి అని విమర్శించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపించి మరోసారి అసెంబ్లీకి పంపాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులైన పేదవారికి 2 సెంట్లు భూమి, వైసీపీ పాలనలో నిర్లక్ష్యంగా వదిలేసిన టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి, అందరికీ అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజలు దామచర్లకు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అలాగే స్థానిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని దామచర్ల వెంట నడిచారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోసూరి శ్రీను, స్థానిక నాయకులు గుర్రం శ్రీను, కుట్టుబోయిన శ్రీను, ఆవుల శ్రీను, శ్రీరాములు, పార్టీ జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులు పాలభిషేకం

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని విభిన్న ప్రతాభావంతులకు రూ. 6వేలు పెన్షన్ మంజూరు చేస్తామని చంద్రబాబు ప్రకటించడంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల సమక్షంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేసి కృతజ్ఞతలు చాటుకున్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు గుట్లపల్లి జనార్దన్, గోపాల్, బొడ్డపాటి వెంకట్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మాగుంట, దామచర్ల ఉగాది శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8 : ఒంగోలులోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు శ్రీ క్రోధి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను జిల్లా ప్రజానీకం కొత్త లక్ష్యాలతో సంతోషంగా జరుపుకోవాలని మాగుంట ఆకాంక్షించారు.

ఒంగోలు (కార్పొరేషన్) : తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినం పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ, సంతోషాలు నిండాలని టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు, పార్టీ శ్రేణులకు, ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనం కలిగిన ఈ పండుగ అందరికీ ఆరోగ్యం, అష్టైశ్వర్యాలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

అరాచక పాలనకు ఫుల్‌స్టాప్ పెడదాం

- బీఎన్ విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఏప్రిల్ 8 : రాష్ట్రంలో వైసీపీ అరాచకపాలనకు ఫుల్‌స్టాప్ పెడదామని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మద్దులూరు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బాబూష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో టీడీపీ అధికారంలోకి వస్తే అమలయ్యే పథకాలను వివరించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయని, వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కడమే అభివృద్ధి అనుకుంటున్నారని, శాశ్వత తాగునీరు, సీసీరోడ్లు, నిర్మాణాలకు పునాది వేసిన తనకు ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఎన్.మీరయ్య, డి.రవి, ఎన్. నాగేశ్వరరావు, ఆర్.సురేష్, నరసింహారావు, పిచ్చయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో ప్రజలతో మాట్లాడుతున్న బీఎన్ విజయ్‌కుమార్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీఎన్ విజయ్‌కుమార్

గ్రామపార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం

మండలంలోని మద్దులూరు గ్రామంలో బీఎన్.విజయ్‌కుమార్ సోమవారం గ్రామ పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ అమలు చేయబోతున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని, ఉన్న కొద్దిసమయంలో ఎక్కువగా కష్టపడాలని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తును పునర్నిర్మించుకోవచ్చని తద్వారా ప్రజల ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశముందన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, టీడీపీ రాష్ట్ర సెక్రటరి అడకాస్వాములు, మాలకొండయ్య, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ గెలుపు కోరుతూ ప్రచారం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8: బీఎన్ విజయ్‌కుమార్ గెలుపు కోరుతూ నాగులుప్పలపాడులో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సోమవారం రాత్రి వడ్డెర కాలనీలో టీడీపీ నాయకులు ఉన్నం వెంకట్రావు, మారెళ్ళ వెంకట్రావు, కట్టా చిరంజీవి, నల్లూరి రవి బాబులు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. బీఎన్ విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మద్దిపాడులో..

మద్దిపాడు : బీసీ సామాజిక వర్గ అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంతి బాబు అన్నారు. సోమవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి బీఎన్ గెలుపునకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో అడకా స్వాములు, ముచ్చు సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు అద్దేపల్లి గంగాభవాని, వేణు గోపాల్ రాజు, దేవబత్తిని ప్రసాదు, చింతల శ్రీను, మండవ గోపీనాథ్, తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం, బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి రమణ, వెల్లంపల్లి గ్రామస్థులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8: టీడీపీ అధికారంలో ఉంటేనే బీసీల అభివృద్ధి జరుగుతుందని తెలుగుదేశంపార్టీ నాయకులు బీఎన్ విజయ్‌కుమార్ సోదరుడు బొమ్మాజి అనిల్ అన్నారు. సోమవారం రాత్రి నిడమానూరు గ్రామంలో గ్రామపార్టీ అధ్యక్షులు డాకా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తక్కెళ్ళపాడు, కొత్తకోట, పోతవరం, కావూరివారిపాలెం, హనుమాపురం, నిడమానూరు గ్రామాల పరిధిలో జరిగిన జయహో బీసీ సదస్సులో మాట్లాడారు. అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం బీసీలను అధోగతి పాలు చేసిందన్నారు. వైకాపా ప్రభుత్వం హయాంలో గడచిన ఐదేళ్లలో బీసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ ఐక్యంగా ఉండి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి మాట్లాడుతూ బీసీ కులాల అభివృద్ధి నికాంక్షించేది తెలుగుదేశం పార్టీ అన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీ కులాలన్నీ కలసి సమష్టిగా తెలుగుదేశం పార్టీ విజయం దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్, అడకా స్వాములు, బి.సెల్వం, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, శరత్, ఎస్. శంకర్, పైడి నాగేశ్వరరావు, స్వర్ణ కిషోర్, ఆయా గ్రామాల బీసీ నాయకులు పాల్గొన్నారు.


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న బొమ్మాజి అనిల్

జేఎంబీ చర్చిలో మళ్లీ రగడ..!

- పదవుల కోసం కమిటీ సభ్యుల మధ్య ముష్టియుద్ధం


జేఎంబీ చర్చిలో గొడవ పడుతున్న ఇరువర్గాలు, పక్కన చెల్లాచెదరుగా విసిరిన కుర్చీలు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 8 : చరిత్రకలిగిన ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో మరోసారి విభేదాలు బహిర్గతమయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా కమిటీ సభ్యుల నియామకంలో జరిగిన గొడవల కారణంగా రెండుగా విడిపోయిన సంఘం కొన్ని నెలల నుంచి రెండు వర్గాల వారు వేర్వేరుగా సంఘ ఆరాధనలు జరుపుకుంటున్నారు. అయితే వీరిలో పాస్టర్ ఆషేర్‌పాల్ వర్గంలో మరోసారి విభేదాలు చోటు చేసుకున్నాయి. ఆదివారం సంఘ ఆరాధన అనంతరం జరిగిన సభ్యుల మధ్య గొడవ ముష్టి యుద్ధానికి దారితీసింది. గత కొన్ని సంవత్సరాలుగా కార్యవర్గ సభ్యులుగా ఉంటున్న కొందరు వారి పదవీ కాలం ముగిసినా పదవులు వదులుకోకపోగా, కొత్త కమిటీ నియామకానికి చర్చ నడిపారు. ఈ క్రమంలో ఇప్పటికే కొనసాగుతున్న కమిటీలోని కొందరు పాస్టర్ ఆషేర్‌పాల్‌కు వ్యతిరేకంగా గొడవకు దిగారు. దీంతో ఆరాధన అనంతరం ఇరు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకోవడతోపాటు పరిశుద్ధ ఆలయంలోనే అసభ్య పద జాలంతో ఒకరినొకరు దూషించుకోవడంపై సంఘస్తులు పెదవి విరుస్తున్నారు. ఏళ్ళతరబడి కమిటీ సభ్యులుగా ఉంటున్న వారు నూతన కమిటీ నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు, తాము తొలగిపోయేది లేదని ఎదురు తిరగడంతో గొడవ మరింత పెరిగింది. దీంతో జరిగిన తోపులాటలు ఉద్రిక్తతకు దారితీశాయి. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. అయితే సమాధానం కోసం ప్రార్థన చేసుకునేందుకు విచ్చేసిన భక్తులు కమిటీ సభ్యుల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలో ఒకే ఆరాధనతో ఎంతో గొప్పగా జరిగే ప్రార్థన కమిటీ పదవుల కోసం జరిగిన గొడవలతో రెండు వర్గాలుగా విడిపోయి వేర్వేరుగా ఆరాధనలు జరుగుతుండగా, ఇందులోని ఓ వర్గంలో గొడవలు మొదలై, రెండుగా విడిపోయి కుమ్ములాటలకు దారితీయడంపై నగరంలోని క్రైస్తవులు పెదవి విరుస్తున్నారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 8 : స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ఈనెల 1నుంచి జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మూల్యాంకన కేంద్రంలో డీఈవో క్యాంప్ ఆఫీసర్ సుభద్ర, పరిశీలకులు ఎంఆర్ ప్రసన్నకుమార్‌లు విలేఖరులతో మాట్లాడుతూ మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. మొత్తం 1.96 లక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేందుకు 1200 మంది టీచర్లను నియమించామన్నారు. ఈనెల 5,7 తేదీల్లో మూల్యాంకనానికి హాజరవుతున్న టీచర్లకు ఎన్నికల శిక్షణ తరగతులు ఉన్నందున అందుకు తగినట్లుగా అదనపు సిబ్బందిని నియమించి మూల్యాంకనాన్ని సజావుగా పూర్తి చేసినట్లు వివరించారు. ముల్యాంకనాన్ని సజావుగా పూర్తి చేసిన టీచర్లందరికి అభినందనలు తెలిపారు. విలేఖరుల సమావేశంలో ఉప విద్యాధికారులు అనితారోజ్‌రాణి, చంద్రమౌళీశ్వరరావు, ఒంగోలు ఎంఈవో టి. కిషోర్‌బాబు, ఈసీఈబీ కార్యదర్శి వై. వెంకట్రావు ఉన్నారు.

అవీ..ఇవీ..

11న న్యాయస్థానాలకు రంజాన్ సెలవు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 8 : రాష్ట్ర హైకోర్టు పరిధిలోని న్యాయస్థానాలకు ఈనెల 11న హైకోర్టు సెలవు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. రంజాన్‌కు మొదట ఈనెల 10న సెలవు దినంగా ప్రకటించారు. అయితే తాజాగా రాష్ట్ర హైకోర్టు దీనిని సవరించి 10కి బదులు 11వతేదీన రంజాన్ సెలవు దినంగా ప్రకటించింది. దీంతో పదవ తేదీన అన్ని కోర్టులకు పనిదినమే. హైకోర్టు ఆధ్వర్యంలోని అన్ని కోర్టులతో పాటు ట్రిబ్యునల్స్ కూడా 10వతేదీ బదులు 11న సెలవు దినం. జిల్లాకోర్టులు, లేబర్ కోర్టులకు కూడా ఈ మార్పు వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిత్రకారుడు రవీంద్రకు ఉగాది పురస్కారం

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 8: ఒంగోలుకు చెం దిన సృష్టి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు, చిత్రకారుడు తిమ్మిరి రవీంద్రకు హరివిల్లు క్రియేషన్స్ ఉగాది పురస్కారం లభించింది. సోమవారం నెల్లూరు టౌన్ హాలు లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సినీ హాస్యనటులు కిషోర్ దాస్, అమరావతి కృష్ణారెడ్డి, దోర్నాల హరిబాబు, తదితరుల నుంచి ఆయనకు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఇది చిత్రకళకు లభించిన పురస్కారంగా భావిస్తున్నానని, మరింతమంది చిత్రకారులను తయారుచేయటానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

సంతనూతలపాడు, ఏప్రిల్ 8: ఓటుహక్కు వినియోగించుకోవా లి. అది ప్రజాస్వామ్యానికి ఆయు ధం అని ఓటర్లకు జిల్లా స్వీప్‌టీం సభ్యులు అవగాహన కల్పిస్తు న్నారు. దీనిలో భాగంగా స్థానిక ఎండ్లూరు డొంకవద్దనున్న ఆర్‌జీయూకేటీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సాయంత్రం జేసీ,నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్.గోపాలక్రిష్ణ అధ్యక్షతన ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పాటలు, నాటికల ప్రదర్శన ద్వారా ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌జీయూకేటీ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ భాస్కర్‌పాటిల్, ఎంపీడీవో శ్రీహరి, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పొగాకు తాళ్లు చోరీ

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 8 : పందిళ్ళలో ఉన్న పొగాకును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అందిన వివరాల మేరకు ఉప్పుగుండూరు గ్రామంలోని మాచవరం రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన గ్రామానికి చెందిన నల్లూరి ప్రసాద్ వైట్ బర్లీ పొగాకు పందిర్లు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి 118 పొగాకు తాళ్ళను దొంగిలించారు. వీటి విలువ సుమారు రూ. 30 వేల విలువ ఉంటుందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్ తోఫా అందజేస్తున్న మురళీకృష్ణ, సంస్థ నిర్వాహకులు

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 8: రంజాన్ నెల సందర్భంగా సోమవారం ముస్లింలకు రంజాన్ తోఫాను పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ పంపిణీ చేశారు. సూ ర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ షహనాజ్, సర్దార్ బాషాలు ఈ తోఫాను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పేద ముస్లింలకు రు.2లక్షల విలువైన 12 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా , ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, జనసేవ శ్రీనివాసరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, సయ్యద్ ఇమ్రాన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు సీపీఎం అభ్యర్థి ఉబ్బా ఆదిలక్ష్మి



సంతనూతలపాడు, ఏప్రిల్ 8: సంతనూతలపాడు సీపీఎం అభ్యర్థిగా ఇండియా కూటమి తరుపున ఉబ్బా ఆదిలక్ష్మి పోటీ చేస్తున్నట్లు ఆపార్టీ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోను, దేశంలో ఇండికూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి ప్రజలకు సంక్షేమపాలన అందించడమే లక్ష్యమని తెలిపారు.

నేడు ఉగాది - తెలుగు వారి తొలి పండుగ

ఒంగోలు (కల్చరల్), ఏప్రిల్ 8 : ఉగాది అంటేనే తెలుగువారికి పెద్ద పండుగ. తెలుగుదనాన్ని అడుగడుగునా ప్రతిబింబించే సంప్రదాయలకు వేదిక ఉగాది పండుగ. ప్రతి ఇంటి వాకిట అందంగా తీర్చిదిద్దిన రంగవల్లులు, నలుగుపెట్టి అమ్మ చేయించే తలంటుస్నానాలు, జీవిత సారాన్ని తెలియజేసేలా తీపి, చేదు, పులుపు, వగరు మొదలైన షడ్రుచుల సమ్మేళనంతో తెలుగువారికే సొంతమనిపించేలా తయారుచేసిన 'ఉగాది పచ్చడి', నేటి నుంచి ఎవరెవరి జాతకాలు ఎలా మారబోతున్నాయి, పంటలు ఎలా పండనున్నాయి వంటివి పంచాంగ పఠనంతో చెప్పే వేదపండితులు, పండుగ ప్రాశస్త్యాన్ని, ప్రకృతి రమణీయతను తమ పద్య, గద్య కవితల ద్వారా హృద్యంగా వర్ణించే కవిసమ్మేళనాలు ఇన్ని ప్రత్యేకతల అచ్చ తెలుగు పండుగ 'ఉగాది'. ప్రతి సంవత్సరం చైత్ర శుక్ల పాడ్యమిని ఉగాది పర్వదినంగా యావత్ తెలుగువారు జరుపుకోవటం ఆనవాయితీ. ఈ రోజునుంచే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుండగా, ఈ కొత్తసంవత్సరాన్ని క్రోధి నామ సంవత్సరంగా పిలవటం జరుగుతుంది.

క్విస్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 8 : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఉగాది, రంజాన్ పండుగల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఉగాది పచ్చడిని అందజేశారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.236

టంగుటూరు, ఏప్రిల్ 8 : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో పొగాకు ధరలు పైపైకి పోతున్నాయి. సోమవారం గరిష్ఠ ధర కిలో రూ.236 పలికింది. కనిష్ఠ ధర రూ.220గా ఉంది. సరాసరి ధర కిలోకు రూ.229.04 లభించింది. ధరలను చూసి రైతులు ఆనందపడుతున్నారు. మున్ముందు మరింత పెరగవచ్చని ఆశిస్తున్నారు. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి వ్యయం పెరిగినందున ధరలు మరింత ఆశాజనకంగా ఉండాలని రైతులు కోరుతున్నారు. సోమవారం మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు రైతులకు చెందిన 904 బేళ్లను వేలంకు అనుమతించారు. వీటిలో 817 బేళ్ల కొనుగోలు జరిగింది. మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. వేలంలో 16 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

మంత్రి సురేష్ ఉగాది శుభాకాంక్షలు

టంగుటూరు, ఏప్రిల్ 8 : జిల్లా ప్రజలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ ఏడాదంతా సుఖసంతోషాలతో, ఆనందంగా గడపాలని భగవంతుడిని కోరుతున్నట్లు తెలిపారు.

జాళ్లపాలేనికి తిరునాళ్ల శోభ

వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో పూజలు ప్రారంభం

పొంగళ్లు పెట్టి మొక్కలు తీర్చుకుంటున్న భక్తులు

ఎన్నికల నేపథ్యంలో విద్యుత్ ప్రభలు రద్దు

కొండపి, ఏప్రిల్ 8 : మండలంలోని జాళ్లపాలెం తిరునాళ్ల శోభ సంతరించుకుంది. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో సోమవారం నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి స్వామి వారికి తలనీలాలు సమర్పించడంతోపాటు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పశుపోషకులు మఠం చుట్టూ పశువులు, జీవాలను ప్రదక్షిణ చేయించారు. ఉగాది రోజైన మంగళవారం ప్రధాన తిరునాళ్ల జరగనుంది. ఈఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో విద్యుత్ ప్రభల ఏర్పాటును రద్దు చేశారు.



ఆలయ ప్రాశస్త్యం...

జాళ్లపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి బ్రహ్మయ్య అనే వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుడు ఆధ్యాత్మిక చింతనలో గడిపి గ్రామంలోని మఠంలో ఉగాది రోజున జీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి ఆయన వారసులు, గ్రామస్థులు నిత్య పూజలు చేస్తున్నారు. ఏటా ఉగాది రోజున తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆరోజు ఆలయ ఆవరణలో ధుని ఏర్పాటు చేస్తారు. అందులో భక్తులు ఎండు కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకుంటారు. పిల్లలు లేనివారు మొక్కుకుని, పిల్లలు పుడితే బ్రహ్మయ్య, వీరబ్రహ్మయ్య, ఈశ్వరమ్మ పేర్లు పెట్టుకుంటుంటారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఉగాది రోజైన మంగళవారం ప్రధాన తిరునాళ్ల జరగనుంది. అందుకోసం ఒంగోలు, పొదిలి, కందుకూరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం దాతలు, ఆయా సంఘాలు అన్నదానంతోపాటు మంచినీరు, మజ్జిగ, పులిహోర పొట్లాలు అందజేయనున్నారు. చిన్నారుల ఆనందం కోసం ఆలయ సమీపంలో జెయింట్‌వీల్, మినీ ట్రైన్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనల కారణంగా పెద్ద ప్రభల ఏర్పాటుకు పోలీసులు, అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఈ ఏడాది ప్రభలు ఎవరూ కట్టడం లేదు.



టీడీపీలో పలువురు చేరిక

సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే స్వామి, సత్య

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్ 8 : మండలంలోని విప్పగుంట, ముళ్లమూరివారిపాలెం గ్రామానికి చెందిన పలువురు కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యల సమక్షంలో ఆదివారం రాత్రి టీడీపీలో చేరారు. వారిలో విప్పగుంట గ్రామానికి చెంది హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేసే కొంకా కొండలరావు, వరపర్ల మహేంద్రతోపాటు ఆరు కుటుంబాలు, ముళ్లమూరివారిపాలెం గ్రామానికి చెందిన నల్లూరి మహేష్, నల్లూరి రమేష్ కుటుంబాలున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి స్వామి, సత్య పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర, కొండపి నియోజకవర్గ అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



స్వామి, సత్య సమక్షంలో టీడీపీలోకి విప్పగుంట, ముళ్లమూరివారిపాలెం వాసులు

టీడీపీతోనే బలహీనవర్గాల అభ్యున్నతి

పార్టీ మండల అధ్యక్షుడు సింగయ్య

సింగరాయకొండ, ఏప్రిల్ 8 : టీడీపీతోనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఆవులవారిపాలెం, అప్పాపురం కాలనీల్లో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో బలహీనవర్గాలు అన్ని విధాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలున్నా ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1,500 అందజేస్తామన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు శీలం చంటి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం మాటున వైసీపీ దోపిడీ

కొండపి, ఏప్రిల్ 8 : వైసీపీ నాయకులు సంక్షేమం మాటున రాష్ట్రాన్ని దోచుకున్నారని కొండపి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీపతి సతీష్ విమర్శించారు. సోమవారం ఆయన మండలంలోని పలుగ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెరిదేపి, ముప్పవరం, కొండపి గ్రామాల్లో వామపక్షాల నాయకులను కలిశారు. అనంతరం ఓట్లు అభ్యర్థించారు. ఈసందర్భంగా సతీష్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పాటుపడింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీపతి ప్రకాశం, మండల అధ్యక్షుడు గుట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

టంగుటూరు, ఏప్రిల్ 8 : టంగుటూరులోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీసీ సనిత్య, సమాఖ్య పాలకవర్గం పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి/పొన్నలూరు : వెలుగు ఆధ్వర్యంలో స్థానిక టంగుటూరు రోడ్డులోని మండల కార్యాలయాల వద్ద సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికుల, ప్రజల సౌకర్యార్థం అధికారుల ఆదేశాల మేరకు దీన్ని ఏర్పాటు చేశామని వెలుగు ఏపీఎం కె.రాజ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. పొన్నలూరులోని మండల కార్యాలయాల ఆవరణలోనూ వెలుగు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజాసంక్షేమానికి టీడీపీ కృషి

● ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ● కంభం నుంచి పలు కుటుంబాలు చేరిక



ప్రజలకు అభివాదం చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 8 : ప్రజా సంక్షేమం కోసమే టీడీపీ కృషి చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గిద్దలూరు మండలంలో నాయకులు కార్యకర్తలతో మాట్లాడారు. తొలుత మండలంలోని జమ్ముళ్లపల్లిలో ఆయన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. నాడు టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలకు టీడీపీ పెద్దపీట వేస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి అందజేయనున్నట్లు తెలిపారు. యువతకు మెగా డీఎస్సీ, జాబ్ కాలెండర్ విడుదల చేస్తామన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేలు, ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులు, వితంతువులకు నెలకు 1వ తేదీనే ఇంటి వద్దకే రూ.4వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ.5వేలు చేసిన ఘనత వైసీపీదేనని యద్దేవ చేశారు. అనంతరం ఆదిమూర్తిపల్లె, అంకనాంపల్లె, ఉయ్యాలవాడ, శింగంపల్లె, లింగాపురం, సూరపల్లి, మిట్టమూర్తిపల్లె, గడికోట, దేవనగరం, సంజీవరాయునిపేట, దంతెరపల్లె, పరమేశ్వర్‌నగర్, అంకిరెడ్డిపల్లె, ఓబులాపురం, దొడ్డంపల్లె, ముండ్లపాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు గోపాలకృష్ణ, బైలడుగు బాలయ్య, శేఖర్, తదితరులు ఉన్నారు.

గిద్దలూరు టౌన్ : గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి భార్య పుష్పలీల అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం గిద్దలూరు పట్టణంలోని 1వ వార్డులో ఆమె ఇంటింటికి వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డికి, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగుంట శ్రీనివాసరెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు పిడతల సరస్వతి, పట్టణ పార్టీ అధ్యక్షులు షాన్వాలి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, శ్రీనివాస్‌ముదిరాజ్, పిడతల రవి, తదితరులు పాల్గొన్నారు.



కంభంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులు

టీడీపీలో 40 కుటుంబాల చేరిక

కంభం : కంభం పట్టణంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో పట్టణంలోని సాద్‌మియా వీధికి చెందిన 25 కుటుంబాలు, ఎస్‌పీజీపాలెంకు చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. టీడీపీలో చేరిన వారిలో పాపిశెట్టి లక్ష్మీనారాయణ, లక్కు శ్రీను, సోమిశెట్టి వెంకటనారాయణ, పిచ్చయ్య, సోమిశెట్టి శ్రీనివాసులు, వెంకటరమణ, ఎద్దుల వెంకటరమణ, ఎస్.బాబు, చిన్నబాబు, నాయబ్, మోహన్‌రావు, మురళి, గద్దె రాములు, సురేష్, నాగార్జున, కోటేశ్వరరావు, చిక్కుడు రోశయ్య, చిక్కుడు చెన్నకేశవులు, రవికుమార్, మజ్ను తదితరులు ఉన్నారు.

అవీ..ఇవీ..

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● చట్టుతాండాలో నీటి కొరత ● శ్రీశైలం ఘాట్ రోడ్డుపై ఆందోళన ● నిలిచిన వాహనాల రాకపోకలు



ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 8: తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలంటూ మండలంలోని చుట్టుతండా వాసులు శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డుపై సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కొన్ని నెలలుగా నీటికొరతతో ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు ఆందోళన చేసినా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా ఆందోళన చేయడం మూడవ సారి. దీంతో రెండు వైపులా కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీటి కోసం రోడ్డెక్కినప్పుడు సంబంధిత అధికారులు, పాలకులు అరకొరగా నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఇలా ఎంతకాలమని ఆవేదన వెలిబుచ్చారు. రోజూ నీటి కోసం రోడ్డెక్కాల్సిందేనా అని ప్రశ్నిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో నాసర్‌రెడ్డి, గ్రామకార్యదర్శి సంధ్యాకుమారి ఘటనా స్థలానికి చేరుకుని చర్చించారు. బోరుబావికి మోటారు ఏర్పాటు చేసి నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

నీటి కోసం రోడ్డెక్కిన దాసరి కాలనీవాసులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని దోర్నాలలోని దాసరి కాలనీ దూదేకుల కాలనీవాసులు పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆందోళన వ్యక్తం చేశారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. దీంతో రోడ్డుక ఇరువైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో సమాచారం తెలుసుకున్న ఎస్సై అంకమరావు ఘటనా స్థలానికి చేరుకొని పంచాయతీ కార్యదర్శితో మాట్లాడారు. చిన్న ఇబ్బందుల వల్ల ట్యాంకర్లు ఆలస్యమయ్యాయని పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాలనీలవాసులు ఆందోళన విరమించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చేయూత



తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పొదిలి, ఏప్రిల్ 8 : కుంచేపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడానికి గ్రామానికి చెందిన పండు చికిన్ సెంటర్ అధినేత వరికుంట్ల అనీల్ తోడ్పాటు అందించారు. గ్రామంలో తీవ్రంగా నీటి ఎద్దడి ఉందని తెలుసుకొని దాన్ని అధిగమించేందుకు సొంత నిధులతో ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలకు తమవంతు కృషి చేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి కూడా శాయశక్తుల కృషి చేస్తామన్నారు. ప్రజలకు సేవ చేయడంలోనే తృప్తి, ఆనందం ఉంటుందని అన్నారు. సొంత నిధులతో దాహార్తిని తీరుస్తున్న ఆయన్ను పలువురు కొనియాడారు.

24 గొర్రె పిల్లలు మృత్యువాత

పొదిలి, ఏప్రిల్ 8 : మండలంలోని జువ్వలేరు గ్రామంలో ఐదుగురు రైతులకు చెందిన 24 గొర్రెపిల్లలు సోమవారం మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే దొడ్డిలో ఉంచిన గొర్రెపిల్లలు ఎలా చనిపోయాయో తెలియని పరిస్థితి ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ దాడిలో సన్నెబోయిన రాజయ్యకు చెందిన 8, సన్నెబోయిన రామాంజనేయులు 3, శ్రీను 4, తిరుపతయ్య 7, దోర్నాల శ్రీనివాసరెడ్డికి చెందిన 2 గొర్రెపిల్లలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. గొర్రెపిల్ల మృతి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు చెప్పారు.

ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 8: స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో డైరెక్టర్, ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ఉగాది పచ్చడి తినిపించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నూతన తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. ముందస్తు రంజాన్ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలు ధరించారు. హాఫీజ్ సయ్యద్ ఇస్మాయిల్ రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ సేవతత్వం, దాతృత్వం పెంచుకోవాలని ఏవో రంజిత్‌కుమార్ అన్నారు. పండుగల సందర్భంగా పాఠశాలలో ఆయాలకు దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆవుల సుబ్బారెడ్డి

కంభం, ఏప్రిల్ 8 : కంభం మండలం కందులాపురం కూడలిలో యోగివేమన సంఘం వారు చలివేంద్రం ప్రారంభించారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆవుల సుబ్బారెడ్డి మాట్లాడుతూ యోగి వేమన సంఘం వారు ఏటా వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ఉగాది సందర్భంగా వివిధ వాహనాల్లో కాటం రాజు వద్దకు వెళ్లే భక్తులకు యోగివేమన సంఘం వారు మజ్జిగను పంపిణీ చేశారు.

రేపు హుబ్లీకి ప్రత్యేక రైలు

శ్రీశైలం వచ్చిన కన్నడ వాసుల కోసం ఏర్పాటు

గిద్దలూరు, ఏప్రిల్ 8 : శ్రీశైలానికి కాలినడకన వచ్చి వెళుతున్న కన్నడవాసుల సౌకర్యార్థం విజయవాడ నుంచి గిద్దలూరు మీదుగా హుబ్లీకి ప్రత్యేక రైలు ఏర్పాటు చేశారు. ఈ నెల 10న బుధవారం విజయవాడలో ఈ ప్రత్యేక రైలు మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.48 గంటలకు గిద్దలూరు చేరుకుని మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు హుబ్లీ చేరుతుందని పేర్కొన్నారు. 11వ తేదీన ఉదయం 9.35 గంటలకు ఈ రైలు హుబ్లీలో బయలుదేరి సాయంత్రం 7.55 గంటలకు గిద్దలూరు చేరుకుని తెల్లవారుజామున ఒంటిగంటకు విజయవాడ చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులు వినియోగించుకోవాలని చీఫ్ కమర్షియల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, రైల్వే కమిటీ సభ్యుడు ఆర్.కె.నరసింహ తెలిపారు.

రెండు వాహనాలు ఢీ

బేస్తవారపేట, ఏప్రిల్ 8: అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలోని బేస్తవారపేట జంక్షన్ వంతెనపై సోమవారం తెల్లవారుజామున రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి స్వల్పంగా గాయాలయ్యాయి. గిద్దలూరు వైపు నుంచి కంభం వైపు వెళుతున్న కారు, బేస్తవారపేట వైపు నుంచి గిద్దలూరు వైపు వెళుతున్న బొలెరో వాహనం రెండు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో వాహనాలు రెండు రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. బేస్తవారపేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'చెత్త ఆలోచన'పై విచారణకు కలెక్టర్ ఆదేశం

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 8: మార్కాపురం మున్సిపాలిటీలో విధులు నిర్వహించకుండానే మస్టర్లు వేసుకొని నిధులు స్వాహా చేస్తుండడంపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. 'వైసీపీ నేతల చెత్త ఆలోచన' శీర్షికన ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ వార్తపై స్పందించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్‌ను ఆదేశించారు. తాను క్షేత్రస్థాయిలో రికార్డులు పరిశీలించి మస్టర్లు వేసి విచారణ జరిపి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతానని కమిషనర్ ఈ.కిరణ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వైసీపీ సేవలో ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్



సిద్ధం సభలో ఫీల్డ్ అసిస్టెంట్ నారపరెడ్డి

త్రిపురాంతకం, ఏప్రిల్ 8: ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటూ కూడా మండలంలోని కొందరు చిరుద్యోగులు వైసీపీకి అనుకూలంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఆదివారం కొనకనమిట్ల అడ్డరోడ్డు వద్ద జరిగిన జగన్ సిద్ధం సభలో పాల్గొనేందుకు బస్సులలో జనాన్ని తరలించేందుకు ఇళ్లిల్లూ తిరిగి జన సమీకరణ కూడా చేశారు. మండలంలోని వెల్లంపల్లిలో ఉపాధిహామీ క్షేత్రసహాయకుడిగా పనిచేస్తున్న కొల్లి నారపురెడ్డి వైసీపీ యాత్ర కోసం ఏర్పాటు చేసిన బస్సులో కార్యకర్తలతో కలిసి ప్రయాణించారు. రామసముద్రం గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న జినుకూటి పెద్దయేసు తన పరిధిలోని ఇళ్ల వద్దకు వెళ్లి యాత్రకోసం జనసమీకరణలో పాల్గొన్నారు. అనంతరం అదే బస్సులో కార్యకర్తలతో కలిసి యాత్రకు వెళ్లారు.

సిద్ధం సభకు తరలిన వలంటీర్



సిద్ధం సభకు వెళుతున్న వలంటీర్

పుల్లలచెరువు, ఏప్రిల్ 8 : ప్రభుత్వ జీతం తీసుకుంటున్న వలంటీర్లు ఎన్నికల వేళ కోడ్‌ను ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీ కారకలాపాల్లో పాల్గొంటున్నారు. వైసీపీ పొదిలిలో నిర్వహించిన సిద్ధం సభకు ఓ వలంటీర్ తరలివెళ్లాడు. కోమరోలు పంచాయతీ కుందంపల్లిలో పనిచేసున్న వలంటీరు నీలబోయిన చిన్న నరసింహారావు గ్రామ నాయకులతో కలిసి సిద్ధం సభకు వెళ్లాడు. ఈ విషయం సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కోడ్ అమల్లో ఉండడంతో ప్రస్తుతం వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీరుపై ఎన్నికల అధికారులు ఏటువంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

వైసీపీ నుంచి జోరుగా టీడీపీలోకి వలసలు

ఆహ్వానించిన ఎరిక్షన్‌బాబు



ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరిన పాత అన్న సముద్రం గ్రామస్థులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 8: త్రిపురాంతకం మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరు కొనసాగుతోంది. ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రం గ్రామంలో వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం గ్రామంలో తట్టమట్టి పోయలేదన్నారు. వైసీపీ పాలనతో దోచుకోవడం, దాచుకోవడం మినహా అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేకల వలరాజు, టీడీపీ నాయకులు మోటుకట్ల శ్రీనివాసరెడ్డి. మల్లెల అల్లూరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడితోనే అభివృద్ధి

పెద్ద దోర్నాల : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని గూడూరి చల్సియా, అజిత్ పేర్కొన్నారు. మండల కేంద్రం దోర్నాలలోని కొత్త తహసీల్దారు కార్యాలయం వీధి, ఇందిరా నగర్, గిరిజన కాలనీ, జీసీసీ వీధుల్లో చల్సియా, అజిత్ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు వారికి సాదర స్వాగతం పలికారు. ప్రధానంగా ముస్లిం మహిళలు చల్సియాను దగ్గరకు తీసుకుని చేతిలో చేయి వేసి హామీ ఇస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ఎరిక్షన్‌బాబు గత మూడేళ్లగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించారని ఇక్కడ సమస్యలు పూర్తిగా అవగాహన చేసుకున్నారన్నారు. విజన్ ఉన్న చంద్రబాబుతో కలిసి నూతన ప్రభుత్వంలో పని చేయనున్నారని ఆదరించాలన్నారు. ఏటా లక్షల్లో ఉద్యోగాలు కల్పన, బీసీలకు రక్షణ చట్టం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. జనసేన, బీజేపీ మద్దతుతో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన తండ్రి ఎరిక్షన్‌బాబును ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిలకు సైకిల్‌గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ భాష, ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చంచయ్య, నాగెళ్ల సత్యనారాయణ, కె సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచకాలకు ఓటుతో గుణపాఠం చెప్పాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరెడ్డి



విజయకేతనం చూపుతున్న నారాయణరెడ్డి, కార్యకర్తలు

మార్కాపురం, ఏప్రిల్ 8: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 32 34 వార్డులలో సోమవారం ఇంటింటికి 'మన కందుల కార్యక్రమం' నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే ఏపీలో అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.15వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆడబిడ్డ నిధి కింద 15 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వనున్నట్లు తెలిపారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. జరగబోయే ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటేసి తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల వసంత లక్ష్మి, రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున్; తాళ్లపల్లి సత్య నారాయణ, షేక్ మౌలాలీ, కొప్పుల శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పైడిమర్రి రామచంద్ర, జనసేన నాయకులు జావిద్ తదితరులు పాల్గొన్నారు.

కందుల సమక్షంలో చేరికలు

మార్కాపురం : మార్కాపురంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం పట్టణం, మండలంలోని బిరుదులనరవకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారిని మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పట్టణంలోని 18వ వార్డుకు చెందిన షేక్ సయ్యద్, అతని మిత్రమండలి సభ్యులు, బిరుదలనరవకు చెందిన కొర్రపోలు శేషయ్య, దేవయ్య, కాశయ్య, తదితరులు సుమారు 20 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు ఉన్నారు.

మార్కాపురం, ఏప్రిల్ 8: సంపద సృష్టించాలన్నా, సంక్షేమాన్ని అమలు చేయాలన్నా మాజీముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సిద్ధం పేరుతో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఆదివారం పర్యటించిన సీఎం జగన్ ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లివ్వడంతో తీవ్ర అన్యాయం చేశారన్నారు. సిద్ధం సభలో ఆయన ఏమి మాట్లాడుతున్నారో అర్థకాని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు జావిద్ అన్వర్ టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలీ, కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పైడిమర్రి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మన కందుల కార్యక్రమం ప్రారంభం

పాల్గొన్న కందుల విఘ్నేష్‌రెడ్డి



రేగుమానుపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కార్యకర్తలు

పొదిలి, ఏప్రిల్ 8 : మండలంలోని ఏలూరు గ్రామంలో నిర్వహించిన ఇంటింటికి మన కందుల కార్యక్రమంలో కందుల నారాయణరెడ్డి, తనయుడు విఘ్నేష్‌రెడ్డి సోమవారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన, బీజేపీలు బలపరిచిన మార్కాపురం టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా కందుల నారాయణ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ తన తండ్రిని ఓటుతో ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ప్రజా సేవలోనే ప్రజలకోసం సుమారు 22ఏళ్లుగా పనిచేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమౌతుందన్నారు. మహిళలకు ప్రత్యేక భద్రత టీడీపీ పాలనలో, చంద్రబాబు పాలనలో ఉంటుందన్నారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిని, మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

కొనకనమిట్ల, ఏప్రిల్ 8 : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షులు మోరబోయిన బాబురావు అన్నారు. మండలంలోని రేగుమానిపల్లి పంచాయితీలోని వద్దిమడుగు గ్రామంలో సోమవారం ఇంటింటికి మన కందల, ప్రజాగళం ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. కందుల నారాయణరెడ్డి సోదరుడు కందుల వేణుగోపాల్‌రెడ్డి, బాబురావు ఇంటిటికి తిరిగి గ్యారెంటీల గురించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివాదాలతోనే సరి..

● నోరు మెదపని జగన్



అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కురిచేడు, ఏప్రిల్ 8: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం రోడ్‌షో ఆద్యంతం అభివాదాలతోనే సరిపోయింది. ఎక్కడా నోరు తెరచి ఒక్కమాట కూడా మాట్లాడలేదు. సోమవారం మధ్యాహ్నం దర్శి మండలం వెంకటాచలంపల్లి వద్ద 11.30 నిమిషాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో కురిచేడు మండలం బోదనంపాడు వద్ద మహిళలు తమకు మంచినీరు కావాలని అడిగారు. అనంతరం కురిచేడు వద్దకు రాగానే ప్రజల కోరిక మేరకు బస్సు లోపలి నుంచి పైకివచ్చి అందరికి అభివాదం చేస్తూ కదిలారు. ప్రధాన కూడలిలో అయినా జగన్ మాట్లాడతారని అందరూ ఆశించారు. ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడకుండా ముందుకు కదిలారు. ఎన్నెస్పీ కాలనీలో ఒక బాలికకు వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వ సహాయం చేస్తుందని హామీ ఇచ్చారు. మరో మహిళకు గృహ నిర్మాణానికి ప్రభుత్వం సాయం చేస్తుందని చెప్పారు. బీసీ కాలనీలో మహిళలు ఆయనను ఆపి అభివాదం చేశారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని వారిని అడిగారు. అనంతరం వెంగాయపాలెం గ్రామంలో ప్రజలకు బస్సులో నుంచే అభివాదం చేసి పల్నాడు జిల్లా వినుకొండకు వెళ్ళిపోయారు. జగన్ ఎక్కడా మాట్లాడకపోవడం, కురిచేడు మండలానికి ఎటువంటి హామీలు ఇవ్వకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. జగన్ వెంట ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, దర్శి వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద రెడ్డి, తదితరులు ఉన్నారు.

దర్శి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- దర్శిలో ముమ్మరంగా ప్రచారం

దర్శి, ఏప్రిల్ 8: దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. సోమవారం దర్శి పట్టణంలోని 13, 14, 19 వార్డుల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 19వ వార్డులో కౌన్సిలర్ దారం నాగవేణి, ఆమె భర్త, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. గజమాలతో లక్ష్మి దంపతులకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను దర్శి ప్రజలు సొంత ఆడపడుచుగా అభిమానించి ఆదరిస్తున్నారని చెప్పారు. మా తాత దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, మా తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నర్సయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తానని చెప్పారు. వారి అడుగుజాడల్లో నడుస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, టీడీపీ కౌన్సిలర్లు వీసీ రెడ్డి, దారం నాగవేణి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణ రెడ్డి, జనసేన పట్టణ అధ్యక్షుడు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

దొనకొండ, ఏప్రిల్ 8: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆపార్టీ మండల నాయకుడు వీరపనేని వెంకన్న చౌదరి అన్నారు. ఆదివారం రాత్రి దొండపాడు గ్రామంలో వైసీపీ కార్యకర్తలు గుమ్మా అంజనేయులు, దొండపాటి వెంకటేశ్వర్లు, దొండపాటి పోలయ్య, మరో 40 మంది కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మామ కడియాల రమేష్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకన్నచౌదరి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పులిమి రమణాయాదవ్, దుగ్గెంపూడి కాశయ్య, కామేపల్లి నారాయణమ్మ, తాండ్ర వెంకటేశ్వర్లు, వల్లపునేని ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.


దొండపాడులో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు

వెలిగండ్ల, ఏప్రిల్ 8: వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువైందని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మెగళ్ళూరులో బీసీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు భరోసా కల్పించేందుకు జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో బీసీ ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్లు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మౌలాలీ, బాలకోటయ్య, కర్నాటి బాస్కర్ రెడ్డి, మీనిగ కాశయ్య, త దితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

పామూరు, ఏప్రిల్ 8: టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని గోపాలపురంలో జరిగిన బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఉగ్రను అత్యధిక మెజార్టీతో గెలిపించుకో వాలని కోరారు. కార్యక్రమాల్లో బూత్ ఇన్‌చార్జి అబ్బారెడ్డి రాజా, స్థానిక నా యకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, దేవరపు మాల్యా ద్రి, సయ్యద్ అమీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ గుర్తింపు

పామూరు, ఏప్రిల్ 8: టీడీపీతోనే బీసీలకు రాజకీయ గుర్తింపు వచ్చిందని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ పర్యవేక్షకులు ఎం.గంగరాజు యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బోడవాడలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన వర్గాల్లో రాజకీయ చైతన్యం నింపి చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించింది టీడీపీనేనని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఉగ్ర తనయుడు జయసింహారెడ్డి, మాజీ ఎంపీపీ దశరథరాములు, మాజీ జడ్పీటీసీ ఎం.హుసేన్‌రావు యాదవ్, సర్పంచ్ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం

పీసీపల్లి, ఏప్రిల్ 8: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాతనే బీసీలకు రాజ్యాధికారం సాకారమైందని ఆపార్టీ బీసీసెల్ కార్యదర్శి వీరయ్య అన్నారు. మండలంలోని భట్టుపల్లిలో సోమవారం రాత్రి జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే బీసీల అభ్యున్నతి జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, మండల బీసీసెల్ అధ్యక్షుడు బ్రహ్మయ్య, సర్పంచ్ డబ్బుగొట్టు రవీంద్ర, జనసేన మండల అధ్యక్షుడు బండారు రాజు, పల్లా మల్లికార్జున్, కనపర్తి శాంసన్, తదితరులు పాల్గొన్నారు.

'కనిగిరి' అభివృద్ధే లక్ష్యం

- కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కోడిగుంపల గ్రామస్థులు

పామూరు ఏప్రిల్ 8: కనిగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం మండంలోని కోడిగుంపల గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పది సంవత్సరాలుగా అధికారం లేకున్నా నియోజకవర్గాన్ని అంటి పెట్టుకొని ప్రజాసేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీలో చేరిన వారిలో వేల్పుల వెంకటయ్య, వెంకటేశ్వర్లు, బాబు, జె.రామయ్య కె.శ్రీనివాసులు, ప్రదీప్, కేశవరావు, వెంకటమ్మ, నారాయణమ్మ, పద్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, గ్రామ, అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, పునుగుపాటి మాల్యాద్రి, మాజీ ఎంపీపీ జి.దశరథరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు సముచిత స్థానం

కనిగిరి, ఏప్రిల్ 8: ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు సోమవారం ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. తొలుత జరిగిన దువ్వా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ముస్లింలను ఉచితంగా హజ్ యాత్రకు పంపిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. రంజాన్‌తోఫాను అందించారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లోనూ ముస్లింలకు సముచిత స్థానం కల్పిస్తూ వారి అభివృద్ధికి చంద్రబాబు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, షేక్ ఫిరోజ్, అహ్మద్, గుడిపాటి ఖాదర్, నజిముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న డాక్టర్ ఉగ్ర

చెక్ పోస్టును తనిఖీ చేసిన డీఎస్పీ

కురిచేడు, ఏప్రిల్ 8: ప్రకాశం, పల్నాడు జిల్లాల మధ్య ఎన్నికల అక్రమాల నిలుపుదల కోసం ఏర్పాటు చేసిన చెక్ పోస్టును సోమవారం మధ్యాహ్నం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ తనిఖీ చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పంపాలని సూచించారు. కాగా, సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీచేయగా రూ.2లక్షల 13 వేలు దొరికినట్టు పోలీసులు తెలిపారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.1,41,716

పామూరు(సీఎస్‌పురం), ఏప్రిల్ 8: మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వార్లకు మహానైవేద్యం సమర్పించి గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం హుండీ ఆదాయం రూ.1,41,716 వచ్చినట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో గిరిబాబు నరసింహాబాబు, తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి పామూరు పట్టణానికి చెందిన దగ్గుల శ్రీనివాసరెడ్డి కల్పన దంపతులు రూ.25,116లు విరాళం అందజేసినట్లు ఈవో తెలిపారు.

ప్రధాన రహదారి దిగ్బంధం.. ప్రజలకు తప్పని పాట్లు

దర్శి, ఏప్రిల్ 8: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర పుణ్యమా అని ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. పోలీసులు అత్యుత్సాహంతో అయన బస చేసిన దర్శి-కురిచేడు రోడ్డులో ట్రాఫిక్‌ను దిగ్బంధంచేసి పక్కకు మళ్లించటంతో ఆప్రాంతానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం జగన్ ఆదివారం రాత్రి బస్సుయాత్రలో దర్శి గడియారస్తంభం సెంటర్‌లో ప్రజలకు అభివాదం చేసి దర్శి - కురిచేడు రోడ్డులోని వెంకటచలంపల్లి రోడ్డు వద్ద బస చేశారు. సోమవారం ఉదయం 11.30 గంటల వరకు అక్కడే ఉన్నారు. దీంతో పోలీసులు ఉదయం నుంచి కురిచేడు వైపు ఎవ్వరినీ వెళ్లనీయకుండా బారికేడ్లు ఏర్పాటుచేసి దిగ్బంధం చేశారు. హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి కావటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దర్శి పట్టణం నుండి 8 కిలోమీటర్ల దూరంలోని పొలాల్లో సీఎం జగన్ బస చేసినప్పటికీ పోలీసులు దర్శి పట్టణంలోని ఆమార్గం దిగ్బంధం చేసి ట్రాఫిక్ నిలిపివేయటం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య

తాళ్లూరు, ఏప్రిల్ 8: అనారోగ్యంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఉదయం తాళ్లూరులో చోటుచేసుకుంది. కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో నివసించే కోట రామిరెడ్డి(68)గత కొంతకాలంగా నొప్పులతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. నొప్పులు భరించలేక సోమవారం ఉదయం గుళికల మందు తిన్నాడు. ఇది గమనించిన రామిరెడ్డి అన్న కుమారుడు రాజశేఖర్ హుటాహుటీన ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయాన్ని తాళ్లూరు పోలీసు స్టేషన్‌కు తెలపడంతో ఏఎస్సై మోహన్‌రావు ఒంగోలు వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

తాళ్లూరు, ఏప్రిల్ 8: మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ నిత్యం రైతాంగం, ఇతరత్రా పనులపై మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

టీడీపీ నాయకురాలు పేరమ్మ మృతి

దర్శి, ఏప్రిల్ 8: దర్శి పట్టణంలోని టీడీపీ మహిళా నాయకురాలు జూపల్లి పేరమ్మ(78) సోమవారం మృతిచెందారు. ఆమె కుమారుడు 18వ వార్డు టీడీపీ బూత్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. పేరమ్మ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాఠశాలలకు ఉపకరణాలు బహూకరణ

కనిగిరి, ఏప్రిల్ 8: ప్రముఖ మిడ్‌వెస్ట్ గ్రానైట్ కంపెనీ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్, కస్తూర్బా స్కూల్, ప్రాథమిక వైద్య కేంద్రానికి విలువైన ఉపకరణా లను సోమవారం అందజేశారు. ఈసందర్భంగా కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. కా ర్యక్రమంలో మిడ్‌వెస్ట్ గ్రానైట్ కంపెనీ నిర్వాహకులు రవీంద్రరెడ్డి, శేషిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

7

మంగళవారం 9 ఏప్రిల్ 2024



నేడే ఉగాది పర్వదినం.. క్రోధి నామ సంవత్సరం పేరిట నూతన ఏడాదిలోకి అడుగు.. ప్రతి ఏడాది ఈ పండుగ పేరిట పంచాంగం శ్రవణం నిర్వహించడం రివాజు కాకపోతే ఇది ఎన్నికల ఏడాది కావడంతో ఈ పంచాంగ పఠనంపై ఎనలేని ఆసక్తి.. అటు ప్రజలకు ఇటు నేతలకు అందరికీ క్రోధి నామ సంవత్సరం ఎన్నికల ఫలితాలపై ఏం చెబుతుందో అనే ఉత్కంఠ.. ఎప్పుడూ లేని విధంగా గడిచిన ఉగాదుల్లో చెప్పిన పంచాంగాల్లో ఎన్ని నిజమయ్యాయో అంటూ లెక్కలు తీస్తూ విపరీతమైన టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు.



తప్పదు.. తాగించెయ్!

- మద్యం దుకాణ ఉద్యోగులపై అధికారుల ప్రతాపం
- రెండున్నరేళ్లుగా షాపుల్లో మగ్గిపోయిన నాసిరకం మద్యం
- ఎన్నికల ప్రచారాల్లో తోసేయాలని విశ్వ ప్రయత్నం
- ప్రభుత్వం మారితే తిప్పలు తప్పవన్న ఆందోళనలో అధికారులు
- ఒక్కో షాపులో నేడు 600 నుంచి 1200 కేసులు
- వాటిని అమ్మకుంటే ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని బెదిరింపులు

నిల్వ మద్యం.. అమ్మాల్సిందే!

ఎక్సైజ్ పోలీస్: పాత స్టాకు ఎప్పటికి అప్పుడు అమ్మమని చెబుతున్నాం. ఎందుకు అమ్మట్లేదు.

షాపు ఉద్యోగి: మేం అన్ని బ్రాండ్లు సేల్‌కు పెడుతున్నాం సార్. కానీ ఎవరూ తీసుకోవడం లేదు సార్.

పోలీస్: ఇదే మాట రేపు అధికారులకు కూడా చెప్పు. వాళ్లే చూసుకుంటారు.

షాపు ఉద్యోగి: కాదు సార్! నేను వాళ్లతో చెప్పలేను కదా సర్!

పోలీస్: అయితే మేం ఇబ్బంది పడాలా? ఇందాక ఒక షాపు అతడు అలాగే చెబితే చేతైతే చెయ్.. లేకపోతే వెళ్లిపో అన్నారు సార్! నీ ఇష్టం..

- ఇదీ జిల్లాలో మద్యం షాపు ఉద్యోగులను నాసిరకం నిల్వ మద్యం అమ్మాలని ఎక్సైజ్ పోలీసులు బెదిరిస్తున్న తీరు. దీంతో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు.

● ఏమ్మా పాత స్టాకు సేల్‌కి ఎందుకు పెట్టడం లేదు? పాత బ్రాండ్లు కూడా సేల్‌కు పెట్టండి. ముందు ఇవి అమ్మండి. అప్పటి వరకూ మిగతా బ్రాండ్లు ఏవీ పెట్టవద్దు. మిగతా బ్రాండ్లు ఒక్క బాటిల్ పోయినా ఒప్పుకోను. సాయంత్రం మీరు వేసే షీటు చూస్తాను. తేడా వస్తే ఒప్పుకోను-

- ఇది రెండురోజుల క్రితం ఎక్సైజ్ ఈఎస్ ఒక షాపు సూపర్‌వైజర్‌కు చేసిన హెచ్చరిక!

గుంటూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నాసిరకం మద్యం అమ్మల్సిందేనంటూ మద్యం షాపుల ఉద్యోగులపై గత కొంతకాలంగా చేస్తున్న ఒత్తిడి తారాస్థాయికి చేరింది. నేరుగా జిల్లాస్థాయి అధికారులే ఈ బెదిరింపులకు దిగుతున్నారు. నిల్వ బ్రాండ్లు అమ్మాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. మరో వైపు నిల్వ మద్యం అమ్మకానికి పెడితే ఆ బ్రాండ్లను మందుబాబులు ముట్టుకోనైనా ముట్టుకోవడం లేదు. దీంతో ఉద్యోగుల పరిస్థితి కరవమంటే కప్పకు కోపం.. విడవ మంటే పాముకు కోపం అన్న చందంగా పరిస్థితి తయారయింది. అధికారుల మందలింపులు, బెదిరింపులు వారికి నిత్యకృత్యంగా మారిపోయి, ఏం చేయాలో తెలియని స్థితిలో సతమతమవుతున్నారు.

భారీగా పేరుకు పోయిన నాసిరకం మద్యం నిల్వలు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం పాలసీ పేరుతో రిటైల్ షాపులన్నీ ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చింది. అప్పటి వరకూ ఉన్న బ్రాండ్లను తీసేసి ఊరు, పేరు లేని కొత్త బ్రాండ్లను పరిచయం చేసింది. అందుకోసం వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. దాన్ని అవకాశంగా తీసుకున్న ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మరికొన్ని నాసిరకం బ్రాండ్లను ప్రోత్సహించారని తెలుస్తోంది. కమీషన్లకు కక్కుర్తి పడి ఆ బ్రాండ్లను ఇష్టారాజ్యంగా షాపులకు తరలించారు. దీంతో ఒక్కో షాపులో పరిమితికి మించి నాలుగైదు రెట్లు మద్యం కేసులు నిల్వలు పడి వున్నాయి.



లిక్కర్ షాపులో మద్యం కేసుల బారులు

ఒక్కో షాపులో వేల కేసులు...

ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఒక్కో రిటైల్ షాపు నిల్వ పరిమితి 280 నుంచి 350 మద్యం కేసులు మాత్రమే. ఒక షాపులో గరిష్టంగా 350 కేసులకు మించి మద్యం నిల్వ వుండకూడదు. కానీ ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఏ షాపులో చూసినా 40 లక్షల నుంచి కోటి రూపాయల విలువ చేసే 600 నుంచి 1200 మద్యం కేసులు, బీరు 25 నుంచి 60 కేసులు, నిల్వ వున్నట్లు తెలుస్తోంది. రాయల్ లైట్, ఓషన్ బ్లూ, అంబర్ హార్స్, 9 సీ హార్సెస్, ఒరిజినల్ చాయ్స్, సథరన్ బ్లూ, గోల్డెన్ స్ట్రైప్స్ విస్కీ, బ్రాందీ వంటి బ్రాండ్లు వందల కేసుల్లో నిల్వలు పడి వున్నాయి. ఇప్పుడు ఆ నిల్వలను అమ్మాలని అధికారులు ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నారు.

ఇండెంటుతో సంబంధం లేకుండా సరఫరా..

సాధారణంగా ఒక షాపులో ఏ బ్రాండు ఎక్కువగా నడుస్తోంది. ఏ బ్రాండు ఎక్కువగా నడవడం లేదు అనేదాన్ని బట్టి షాపు సూపర్‌వైజర్ లిక్కర్ డిపోలకు ఇండెంట్ ఇస్తారు. కానీ దాంతో సంబంధం లేకుండా అధికారులు నాసిరకం మద్యాన్ని సరఫరా చేశారు. అవి నడవడం లేదని షాపు సిబ్బంది చెప్పినా పట్టించుకోకుండా వాటిని సరఫరా చేశారు. ఆ బ్రాండ్లు ప్రాణాంతకంగా మారడంతో మందుబాబులు వాటివైపు తిరిగి కూడా చూడలేదు. చేసేదేమీ లేక షాపు ఉద్యోగులు వాటిని పక్కనపెట్టి ఊరుకున్నారు. ఇలా రెండు ఏళ్లకు పైగా నిల్వలు మద్యం కేసులు పేరుకుపోయాయి. వాటిలో చాలా వరకూ ఇప్పుడు రంగు మారిపోయాయని సిబ్బంది చెబుతున్నారు. వాటిని అమ్మాలంటే వణికిపోతున్నారు. అధికారులు మాత్రం అమ్మి తీరాల్సిందేనంటూ పీక మీద కత్తి పెట్టి బెదిరిస్తున్నారు. అసలే నాసిరకం మద్యం. అందులోనూ ఏళ్ల తరబడి నిల్వ వున్న మద్యం కావడంతో దాన్ని విక్రయించేందుకు ఉద్యోగులు జంకుతున్నారు. ప్రాణాంతకంగా మారిన ఆ మద్యం తాగి మందుబాబులకు ఏమైనా జరిగితే ఆ నేరం తమ మీదకే వస్తుందని వారు భయపడుతున్నారు. ఇదిలా వుండగా అధికారులు ఒత్తిడి అంతకంతకూ పెంచుతూ వున్నారు. ఉద్యోగాలు పోతాయని బెదిరిస్తున్నారు. అయినా సరే ఈ మద్యం అమ్మడం తమ వల్ల కాదని, ఉద్యోగాలు మానుకోవడమే శ్రేయస్కరమని మెజారిటీ ఉద్యోగులు భావిస్తున్నారు.

ఎన్నికల హడావుడిలో సొమ్ము చేసుకునే యత్నం

మే 13న రాష్ట్రంలో సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో దాన్ని అనువుగా చేసుకుని నిల్వ మద్యాన్ని సొమ్ము చేసుకోవాలని ప్రభుత్వం, అధికారులు భావిస్తున్నట్లుగా తెలియ వస్తోంది. ఎన్నికల ప్రచారాల సమయంలో పెరిగే మద్యం డిమాండును ఆసరా చేసుకుని నిల్వ మద్యాన్ని అమ్మేయాలని అధికారులు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వం మారితే సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందన్న భయం, ఒప్పందం చేసుకున్న డిస్టిలరీల నుంచి వచ్చే ఒత్తిడి తదితర అంశాల దృష్ట్యా నిల్వ మద్యాన్ని మందుబాబుల గొంతులో ఎలాగోలా పోసేయాలి. వాటిని కాసులుగా మార్చుకోవాలని అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ ఇది తమ ప్రాణాల మీదకు వస్తుందేమోనని ఉద్యోగులు భయపడిపోతున్నారు.



ఉగాది వేళ... ఎన్నికలలో!

- క్రోధి నామ సంవత్సరంలోకి నేడే ప్రవేశం
- పొలిటికల్ పంచాంగంపై సర్వత్రా ఆసక్తి
- కిందటి పంచాంగం శ్రవణాలను తిరగేస్తున్న నేతలు
- జోస్యాలు ఎన్ని నిజమయ్యాయో అంటూ లెక్కలు
- కొత్త ఆశలకు ఈ ఉగాది పునాది కావాలంటున్న టీడీపీ

బాపట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇప్పటికే నేతలు ప్రచారం జోరు పెంచి కోపతాపాలకు లోనవుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ హీట్ మరింత పెరిగి విమర్శల ధాటి పెరగనుంది. క్రోధం అంటే కోపం.. సరిగా ఎన్నికల మూడ్‌కు సరిపోయే విధంగా యాదృచ్ఛికంగా ఈ ఏడాదిని క్రోధి నామ సంవత్సరంగా పేర్కొనడం గమనార్హం. శోభకృత్ నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి క్రోధి నామ సంవత్సరంలోకి మంగళవారం తెలుగు ప్రజలు అడుగుపెట్టనున్నారు.

అన్ని రుచులను స్వీకరిస్తారా లేక...

ఎన్నికల ఏడాది కావడంతో నేతలకు ఏరుచి మిగులుతుందో అనే లెక్కలు ఇప్పటికే వేస్తున్నారు. ఎవరికి వారు క్రోధి నామ సంవత్సరం తమకు గెలుపును అందించి తమకు తీపిని మిగిలిస్తుందనే భావిస్తున్నారు. ఓటర్లు మాత్రం ఇప్పటికే ఓ నిర్ణయానికి రాగా ఉగాది పర్వదినం రోజు దానిని మరింత దృఢ పరచుకుని ఎవరికి చేదుగుళిక ఇవ్వాలో తేల్చేసుకుని దానిని మనసులో పదిలంగా భద్రపరచుకుని పోలింగ్‌రోజు అందించనున్నారు. ఇప్పటికే పాలకపార్టీ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో అన్నీ రుచులను సమపాళ్లలో రంగరించ లేకపోయామనే అంచనాకు వచ్చింది. దీంతో అయిష్టంగానే ఉగాది షడ్రుచుల పచ్చడిని తీసుకోవడానికి సిద్ధమయినట్లు కనిపిస్తోంది.

ఉగాదిని ప్రచారంలోకి జొప్పిస్తూ...

జిల్లాలో అధికార వైసీపీ క్రోధినామ సంవత్సరం మిగల్చబోయే చేదును తలచుకుని డీలా పడుతుంటే మరో వైపు టీడీపీ మాత్రం నూతన ఏడాది ఉగాదిని ప్రజల భవిష్యత్తుతో ముడిపెడుతూ వారిని ఆలోచింప చేసే విధంగా నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ ఉగాది ఆంధ్రుల ఆశలకు పునాది వంటిదని, ఓటర్లు ఆలోచించి కూటమికి ఓట్లు వేయాలని తద్వారా రోజూ ఉగాదే వస్తుందని లేకపోతే ఆంధ్రప్రదేశ్ కు గోదారి ఖాయమనే ఎన్నికల ప్రచారాన్ని ఓటరు మహాశయుల ముందుకు తీసుకెళుతున్నారు.

పార్టీ కార్యాలయాల్లో జోరుగా పొలిటికల్ పంచాంగం...

గతేడాదితో పోలిస్తే దాదాపు ప్రతి నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం జరపడానికి పార్టీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎవరికి వారు పొలిటికల్ పంచాగం తమకే అనుకూలమని చెప్పించుకోవడానికి తహతహలాడుతున్నారు. అతి కొద్దిమంది నేతలు మాత్రం పంచాంగ శ్రవణంలో తమ జోక్యం లేకుండా ఉన్నది ఉన్నట్లు వివరించాలని చెప్పినట్లు తెలుస్తోంది. మరో వైపు గత ఉగాదిల్లో చెప్పిన పంచాంగ శ్రవణాల్లో ఎన్ని నిజమయ్యాయో అనే లెక్కలు కూడా కొంతమంది నేతలు తీస్తూ ప్రచారాన్ని పక్కన బెట్టి బిజీబిజీగా గడుపుతున్నారు.

ఈ ఏడాది తమదే...

క్రోధి నామ సంవత్సర ఉగాది కచ్చితంగా తమదేననే ధీమాను టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. గతేడాది ఉగాదితో పోలిస్తే ఈ ఉగాది తమకు ఎంతో ప్రత్యేకమని తెలుగుదేశం అంటోంది. వైసీపీ పాలనపై ఉన్న మబ్బులు విడిపోయి ఓటర్లంతా తమకే పట్టం కట్టాలనే స్థిర నిర్ణయాన్ని ఉగాది వేళ ప్రజలంతా తీసుకోబోతున్నారని తేల్చి చెబుతున్నారు. షడ్రుచులు కలిస్తేనే ఉగాది పచ్చడికి అర్థమని, అదే విధంగా పాలనలో అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ, సకల రంగాలను తిరిగి గాడిన పెట్టగలిగేది కూటమి ప్రభుత్వమేననే నిర్ణయానికి ఓటర్లు వచ్చేశారని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.27(మంగళవారం)

సహారీ (ఉదయం) 4.40 (బుధవారం)

అభివృద్ధి..సంక్షేమానికి ప్రాధాన్యం

- కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణప్రసాద్, కొండయ్య

చీరాల, ఏప్రిల్ 8 : అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ, సంపద సృష్టికర్త చంద్రబాబు సారథ్యంలో ముందుకు సాగుతామని టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. సప్తగిరి లాడ్జి కాన్ఫెరెన్స్ హా లులో సోమవారం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్యతో కలిసి విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి.. అభివృ ద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞ ప్తి చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కుందేరు, రొంపేరుల లో ఆక్రమణల తొలగింపు, ఆధునికీకరణకు ప్ర త్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. చేనేతలకు, దళితులకు, రైతులకు, వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. నేతన్నలకు మెగాటెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. వాడరేవులో హార్బర్ నిర్మాణంతో పాటు, రైలు మార్గానికి చర్యలు చేపడతామన్నారు. పరిశ్రమల స్థాపనకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. త ద్వారా ఉత్పత్తులు, విక్రయాలపై వచ్చే జీఎస్టీతో అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ కుంటుపడకుండా ముందుకు సాగుతామన్నారు. హైటెక్ సిటీ నిర్మాణం నేపథ్యంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన కు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో పూర్తిచేసి సాధించిన సత్ఫలితాలను కృష్ణప్రసాద్ వివరించారు. అదే స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల అభ్యున్నతి, ఆర్థిక స్థితిగతులు కుంటుపడ్డాయన్నారు. దీంతో సగటు మనిషి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గుర్తులైన సైకిల్‌కి ఓట్లు వేసి తమను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాతాని ఉమామహేశ్వరరావు, గౌరీ అమర్‌నాథ్, బీజేపీ నేత మువ్వల వెంకటరమణరావు, జనసేన నేత ఆలా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థులు కృష్ణప్రసాద్, కొండయ్య

దొడ్లేరు ఓట్లు అద్దంకిలో..

- విచారణ చేపట్టిన జేసీ

అద్దంకి, ఏప్రిల్ 8 : పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని దొడ్లేరుకు చెందిన 21 ఓట్లు అద్దంకి పట్టణంలో చేర్చడంపై జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌బాబు సోమవారం విచారణ చేపట్టారు. అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పాణెం చినహనిమిరెడ్డిని నియమించిన తరువాత దొడ్డిదారిన దొడ్లేరులో ఉన్న 21 ఓట్లను అద్దంకి పట్టణంలో తప్పుడు ధ్రువపత్రాలతో చేర్పించారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. మూడు రోజులలో నివేదిక అందజేయాలని ఎన్నికల ప్రధానఅధికారి ఉత్తర్వులు ఇచ్చారు. అయితే నివేదిక అందజేయడంలో ఆలస్యం చేయడంతో పాటు, స్థానిక అధికారులే విచారణ చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం జేసీ శ్రీధర్‌బాబు ఓట్లు నమోదైన ఇళ్లను పరిశీలించారు. అయితే ఆ సమయంలో ఆ ఇళ్లకు తాళాలు వేసి ఉండడం గమనార్హం. స్థానిక ధ్రువీకరణ పత్రాలేవీ లేకుండా ఆధార్ కార్డులలో అడ్రస్‌లు మార్పు చేయడం, వాటి ఆధారంగా ఓట్లు చేర్చడంపై జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌బాబు అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి సునీల్‌కుమార్, తహసీల్దార్ మహబూబ్ సుభానీ ఉన్నారు.

అప్పుల బాధతో దంపతులు మృతి

బాపట్లరూరల్, ఏప్రిల్ 8: అప్పుల బాధతో పురుగు మందు తాగి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన కోయ విష్ణుప్రసాద్ (48), భార్య కోయ వరలక్ష్మీ (38) గ్రామంలో ఎరువుల దుకాణం నడుపుకుంటూ జీవనాన్ని కొనసాగించేవారు. అయితే ఆర్థిక సమస్యల వలన అప్పులు పెరిగిపోవటంతో తన నివాసంలో ఇద్దరు పురుగు మందు తాగి అప్పుల బాధతోనే ఆత్మహత్యచేసుకుంటున్నామని సూసైడ్ లెటర్ తన జేబులో పెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరికి నాని అనే ఒక కుమారుడు ఉన్నాడు. నాని ఇంటర్మీడియట్ చదువుతున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఎన్నికల నిర్వహణ, సంసిద్ధతపై రిటర్నింగ్ అధికారులు, సంబంధిత నోడల్ అధికారులతో సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామాగ్రి సేకరణ, కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఈవీఎం యంత్రాలు, ఎన్నికల సిబ్బంది తరలింపు కొరకు వాహనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు మూడురోజులలో సిద్ధం చేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ నివేదికలు ఎప్పటికప్పుడు కమిషన్‌కు పంపాలన్నారు. సీవిజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి విధి నిర్వహణలో ఉండే ఉద్యోగుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన పలుసూచనలు చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అడిషనల్ ఎస్పీ టీడీ విఠలేశ్వరరావు, ఆర్‌వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



రిటర్నింగ్, నోడల్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ధర్మవరం చెరువు ఆక్రమణ

- నిదానంపాటి అమ్మవారి ఆలయ నిర్మాణం పేరుతో ఆక్రమణ
- తెరవెనుక వైసీపీ నేతల హస్తం

అద్దంకి, ఏప్రిల్ 8 : ఏదో ఒక విధంగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు వైసీపీ నేతలు పన్నాగాలు పన్నుతున్నారు. ఎన్నికల హడావుడిలో అధికారులు ఉండడంతో వైసీపీ నాయకులు తమ కబ్జా పనిని ముగించుకుంటున్నారు. మండలంలోని ధర్మవరం చెరువును ఆక్రమించి మెరకతోలి ఆక్రమణకు సిద్ధం చేశారు. నిదానంపాటి అమ్మవారి దేవాలయం నిర్మాణం పేరుతో అమ్మవారి పటాన్ని ఏర్పాటు చేశారు. దేవాలయం పేరుతో మరికొంత స్థలాన్ని ఆక్రమించుకునే ఏర్పాట్లు రహస్యంగా జరుగుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చెరువును ఆక్రమించి మెరక తోలుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం విమర్శలకు తావిస్తుంది. వైసీపీ నాయకులు తెరవెనుక ఉండి కథను నడుపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కొంత భాగంలో దేవాలయం పనులు చేపట్టి, మిగిలిన భాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ధర్మవరం చెరువు ఆక్రమించి మెరక తోలి దేవాలయం నిర్మాణం పేరుతో ఏర్పాటు చేసిన నిదానంపాటి అమ్మవారి ఫోటో

టీడీపీలోకి వలసల జోరు

» ఏలూరికి మద్దతుగా ఊళ్లకుఊళ్లు
» కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే





ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన నాగులపాలెం ఎస్సీ కాలనీవాసులు, ఆదిపూడి ఎస్సీ సోదరులు, బాపయ్య నగర్ అగ్నికుల క్షత్రియులు

పర్చూరు, ఏప్రిల్ 8 : పర్చూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల జోరు ఊపందుకుంది. ఊళ్లకుఊళ్లు తరలి వచ్చి సైకిలెక్కుతున్నారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు జనం జై కొడుతున్నారు. తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి ఏలూరి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. ప్రతినిత్యం వందల సంఖ్యలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరడం ఇందుకు నిదర్శనం. సోమవారం పర్చూరు నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు.

నాగులపాలెం ఎస్సీ కాలనీ..

పర్చూరు మండలం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారిలో దుడ్డు సంజయ్‌బాబు, ఏజర్ల చిన్నబాబు, డీ సత్యంబాబు, సతీష్, తేళ్ల వినయ్, వికాస్, గనిపిశెట్టి సాగర్, నగరికంటి కపిల్, కూరాకుల సునీల్, కూరాకుల రాంబాబు, బడుగు మిల్టన్, తెనాలి బెంజిమెన్, సాధు మోషే, దాసి జీవన్, కొమ్ము ఏసోబు, నలతోటి మార్కు, ఏజర్ల ప్రసాద్ జన్, రుద్రపాటి వీరయ్య, షేక్ అల్లు, రుద్రపాటి అన్నారావు, బత్తుల కిరణ్, సాధు కల్యాణ్, మిక్కిలి సన్నిబాబు ఉన్నారు.

జొన్నతాళి నుంచి..

జొన్నతాళి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చేరినవారిలో ఏలూరి వెంకటేశ్వర్లు, మురారి చిన్నశ్రీనివాసరావు, మురారి వెంకట్రావు, ఏలూరి లంచవయ్యా తిరుపతిరాయుడు, చిన్నవీరస్వామి, శ్రీనివాసరావు ఉన్నారు.

ఆదిపూడి గ్రామం...

కారంచేడు మండలం ఆదిపూడి గ్రామానికి చెందిన పలువురు నాయకులు టీడీపీ చేరారు. చేరిన వారిలో బత్తుల రామారావు, పారి ఏసు పాదం, ధరరాజు పల్లి నాగరాజు, గొర్రెపాటి రోశయ్య, పారి వినోద్ ఉన్నారు.

చిన్నగంజాం....

చిన్నగంజాం బాపయ్య నగర్‌కు చెందిన పలు కుటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొక్కిలిగడ్డ పోలయ్య, కొక్కిలిగడ్డ ఆక్కేశ్వరరావు, ఐల అంజనేయులు, అంకయ్య, భూమిడి రవీంద్ర, కొక్కిలిగడ్డ రాజారావు, ఐల శ్రీను, కొక్కిలిగడ్డ పరిశుద్ధరావు, వల్లభూని నరేంద్ర, రేవు ఆదినారాయణ, ఏడుకొండలు, కొక్కిలిగడ్డ మరియమ్మ, రేవు లావణ్య, బ్రహ్మయ్య, వల్లభనేని ఆదాం, బాల, ఐల వెంకటమ్మ, శేషమ్మ లక్ష్మీ, సంకె నారాయణ ఉన్నారు.

కడవకుదురు ఎస్సీ కాలనీ..

కడవకుదురు ఎస్సీ కాలనీకి చెందిన దోమందుల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, చిలక స్వప్నకుమార్, సుంకర వినోద్ కుమార్, కుమ్మ ఆదాములు, బలసారిసోమయ్య, మురుకుపూడి మధుబాబు, పంది లాజర్, పంది మంగయ్య, చుండూరి నరేష్, రేపూరి పౌలు, కత్తి పుల్లారావు, రేపూరి ఆజేయ్, చిలకా నవీన్, కొమ్ము రాజారావు, గాలి ప్రకాష్, కొమ్ము సుబ్బారావు, కత్తి చిన్న గాలి సుబ్బారావు, సుంకర కోటేశ్వరరావు ఉన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

ఉద్యోగాలకు 45 మంది విద్యార్థుల ఎంపిక

చీరాల, ఏప్రిల్ 8 : సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం టీవీఎస్ సుందరం ఫాస్టనర్స్ లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 45 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థిక అభివృద్ధి



మహిళలకు మిషన్లు అందజేసిన రోటరీ సభ్యులు

పర్చూరు, ఏప్రిల్ 8 : మహిళలు స్వయం శక్తితో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే రోటరీ కుట్టు శిక్షణను ఏర్పాటు చేయడం అభినందనీయమని తానా ప్రతినిధి కొల్లా అశోక్‌బాబు అన్నారు. పర్చూరు రోటరీ చేపడతున్న పలు సేవా కార్యక్రమాలను అయన కొనియాడారు. సోమవారం రోటరీ భవన్‌లో 100 రోజుల కుట్టు శిక్షణ పొందిన 40 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను అశోక్ అందజేశారు. ప్రోగ్రాం సమన్వయకర్త, క్లబ్ ఒకేషనల్ చైర్మన్ రావి సత్యనారాయణ మాట్లాడుతూ రోటరీ సేవలను గుర్తించి ఆర్థిక సాయం అందజేసిన తానా సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రోటరీ ప్రతినిధులు పాబోలు ఉదయ భాస్కర్, కోటా శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, రమేష్ చంద్ర, రాజ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న, కుట్టు మిషన్లు అందుకున్న లబ్ధిదారులు, శిక్షకులు రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఎన్నికల అధికారి, ఆర్డీవో రవీందర్

పర్చూరు, ఏప్రిల్ 8 : అత్యవసర సర్వీస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అత్యవసర సర్వీస్ ఉద్యోగుల ప్రతనిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అత్యవసర సర్వీస్ ఉద్యోగులు తప్పకుండా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి డిపార్టుమెంట్ వారికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఈసీ ఆదేశాల మేరకు ఫారం -12డీని అందజేస్తారన్నారు. ఆర్వో కార్యాలయాల్లో ఉండే కేంద్రాల్లో ఓటును వినియోగించుకునేందుకు డిపార్టుమెంట్ అధికారులు సహకరించాలని ఆర్డీవో తెలిపారు. సమావేశంలో పర్చూరు ఏఆర్వో సీహెచ్.సుబ్బయ్య, కారంచేడు మెహర్‌బాబు, చిన్నగంజాం ఫణీంద్ర బాబు, ఇంకొల్లు ప్రమీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆనందంగా..ఆరోగ్యంగా ఉండాలి

ఎఫర్ట్ కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం చేస్తున్న సీతారామాచార్యులు

మార్టూరు, ఏప్రిల్ 8 : ఉగాది పండుగను పురస్కరించుకొని సోమవారం రాత్రి ఎఫర్ట్ కార్యాలయంలో రోటరీ క్లబ్, శ్రీకారం కళాపరిషత్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ఆచార్యులు ఐనవోలు సీతా రామాచార్యులు కొత్త సంవత్సర పంచాంగ శ్రవణాన్ని చదివి ప్రజలకు వివరించారు. ఉగాది పండుగ తీపి, చేదు కలయిక అని, కొత్త ఏడాదిలో ప్రజలందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆయన భగవంతునికి విన్నవించారు. అనంతరం శ్రీకారం కళాపరిషత్ కళాకారులు పాటలు, గేయాలతో అలరించారు. ఈ ఉగాది ప్రజలందరి జీవితాలలో కొత్త వెలుగులు తీసుకురావాలని కళాకారులు ఆకాంక్షించారు. భోజన కార్యక్రమంతో ముగిసింది. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, జాష్టి సాంబశివరావు, ఎం.ఈశ్వరప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య పాల్గొన్నారు.



పూనూరులో కవాతు చేస్తున్న పోలీసులు

కేంద్ర బలగాల పర్యటన

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 8: యద్దనపూడి మండలంలో సోమవారం కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు పర్యటించారు. మార్టూరు రూరల్ సీఐ సాతీరామ్, యద్దనపూడి ఎస్ఐ జీవీఎస్ చౌదరి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు గ్రామాలలో కవాతు నిర్వహించారు. పోలూరు, చిమటావారిపాలెం, మున్నంగివారిపాలెం, తను బొద్దివారి పాలెం, పూనూరు గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో శాంతియుతమైన వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులపై చర్యలుంటాయని సీఐ తెలిపారు. పోలీసులు గ్రామాలలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నిఘాతో ఉన్నారని, అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై దృష్టి సారించామని, ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని సీఐ ప్రజలకు సూచించారు.



ప్రచారం నిర్వహిస్తున్న యువ నేత కమల్‌కిషోర్

గొట్టిపాటిని ఎమ్మెల్యేగా గెలిపించండి

ఇంటింటి ప్రచారంలో యువనేత బాబీ

బల్లికురవ, ఏప్రిల్ 8 : నిత్యం ప్రజలతో ఉంటూ రెండు దశాబ్దాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను మళ్లీ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) కోరారు. మండలంలోని గొర్రెపాడు గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి రవికుమార్‌కు మద్దతుగా బాబీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాబుష్యూరిటీ పథకాలతో పేదలు, ముఖ్యంగా మహిళలకు ఎంతో ప్రయోజనం ఉందన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి గొట్టిపాటిని గెలిపించాలని బాబీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ నేతలు ముంద్రు దానయ్య, కల్లూరి రమేష్, పాపసాని రాఘవ, మక్కెన స్వాములు పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

పంగులూరు, ఏప్రిల్ 8 : మండలంలోని చందలూరు గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో 9వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు పంచాంగ శ్రవణం జరుగుతుందని ఆలయ అర్చకులు పర్చూరి రఘునాథాచార్యులు తెలిపారు. క్రోధి నామ సంవత్సరం ఉగాది సర్వదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిందూ కళాశాల ఆంధ్రోపన్యాసకులు, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు బ్రహ్మశ్రీ నందనవనం శ్రీనివాసరావు పంచాంగకర్తగా వ్యవహరిస్తారని తెలిపారు. గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం



వెంకటేష్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

చీరాల, ఏప్రిల్ 8 : ఆర్య, వైశ్యులకు ఎప్పుడు అండగా ఉంటామని, ప్రశాంత వాతావరణం కొనసాగిస్తామని వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఎంజీసీ మార్కెట్‌లోని అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చిమటా సాంబు, పూటుకూరి ఏకాంబరేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.1,85,450 స్వాధీనం



నగదును సీజ్ చేస్తున్న ఎస్ఐ

చినగంజాం, ఏప్రిల్ 8 : చినగంజాం సమీపంలోని టోల్ ప్లాజా బోర్డర్ చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గిద్దలూరు మండలం తిమ్మాపురం నుంచి కర్లపాలెం మండలం యాజలి వెళ్తున్న లగేజి వాహనాన్ని తనిఖీ చేయగా వాహనంలో రూ.1,85,450ని గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. డ్రైవర్ చిలకా రామాంజనేయులు యాజలి గ్రామంలో మిరపకాయలు కొనుగోలు నిమిత్తం నగదు తీసు కెళ్తున్నట్లు చెప్పారన్నారు. గిద్దలూరు మండలం దిగువమిట్ట గ్రామానికి చెం దిన సమ్మెట విజ్ఞాన్‌రెడ్డి సూచన మేరకు కర్లపాలెం మండలం ముండివారిపాలెం గ్రామానికి చెందిన మిరపకాయల దళారీ రవీంద్రారెడ్డి వద్ద మిరపకాయలు కొనుగోలు చేసేం వెళ్తున్నట్లు వాహన డ్రైవర్ చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. నగదుకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

నిత్యావసరాల ధరల తగ్గింపులో వైసీపీ విఫలం

» యువనేత హర్షవర్ధన్
» తండ్రి కోసం తనయుడి ప్రచారం



పరిటాలవారిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న యువతనేత హర్షవర్ధన్

సంతమాగులూరు, ఏప్రిల్ 8 : ఐదేళ్లుగా రాష్ట్రంలో నిత్యావరసర సరుకుల ధరలను అదుపు చేయడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని యువనాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ తెలిపారు. కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ సోమవారం మండలంలోని పరిటాలవారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు, ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇప్పటి వరకూ నాన్న ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని, మున్ముందు మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఒక్కచాన్స్ అంటూ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని హర్షవర్ధన్ అన్నారు. వైసీపీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పన్నులు, చార్జీలు పెంచనని హామీలు గుప్పించిన జగన్ అధికారంలోకి రాగానే ప్రజలపై ఎడా పెడా బస్సు, విద్యుత్ చార్జీలు పెంచి వాతలు పెట్టారన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి సంక్షేమం సమాంతరంగా అమలయ్యాయన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులుగా డిపర్తి వెంకట్రావు, అట్లాచిన వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దూపాటి ఏసోబు, అలూరి శ్రీనివాసరావు, వసంత వేణుబాబు, తేలప్రోలు రమేష్, పెద వెంకటరెడ్డి, పార్లమెంట్ మహిళా కార్యదర్శి నాగబోతు సుజాత, కోణికి గోవిందమ్మ, శ్రీనివాసరావు, అయినాల గోపి, అయినాల మారుతి, ఆంజనేయులు, వాసిరెడ్డి, రాజశేఖర్, శ్రీను, వెంకట్రావు, ఏడుకొండలు, అశోక్, శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు రామాంజి, జిల్లా కార్యదర్శి చల్లా కృష్ణ, పార్టీ అనుబంధం బాగాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



8 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 8 : మండలంలోని కనకనాగారపమ్మ ఆలయం రోడ్డు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 8 ట్రాక్టర్లను వేటపాలెం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

సీఐ సోమశేఖర్

చీరాలటౌన్, ఏప్రిల్ 8 : చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, తప్పు చేస్తే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ బేతపూడి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎన్నికల దృష్ట్యా సోమవారం ప్రత్యేక పోలీసు బలగాలతో స్టేషన్ పరిధిలో సీఐ రూట్ మార్చ్ నిర్వహించారు. రామనగర్, ఆదినారాయణపురం, న్యూకాలనీ ప్రాంతాలలో విస్తృత తనిఖీలను చేశారు. పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లకు వారి ఇళ్ల వద్ద కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తనతో సాగాలన్నారు. కేసుల్లో ఇరుక్కుని జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకోవద్దని హితవు పలికారు. ఓటర్లకు పూర్తి రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, బీఎస్ఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

- అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేగా మరో అవకాశం ఇవ్వాలి
- 6వ డివిజన్‌లో దామచర్ల ఇంటింటి ప్రచారం



ఆరో డివిజన్‌లో మహిళలతో మాట్లాడుతున్న దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్) ఏప్రిల్ 8 : అన్నీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు అడుగులు ముందుకు వేస్తున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఒంగోలు టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. సోమవారం నగరంలోని 6వ డివిజన్‌లో దామచర్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, అన్నీ వర్గాల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. మూడు వేలు ఫించన్‌ఇస్తానని అబద్ధాలు చెప్పిన జగన్ రెడ్డి, ఆ మాట నిలబెట్టుకోవడానికి ఐదేళ్ళు పట్టిందన్నారు. విడతలవారీగా పింఛన్ సొమ్ము పెంచి, ప్రజలను మోసం చేసిన వ్యక్తి సైకో జగన్ రెడ్డి అని విమర్శించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో తనను గెలిపించి మరోసారి అసెంబ్లీకి పంపాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులైన పేదవారికి 2 సెంట్లు భూమి, వైసీపీ పాలనలో నిర్లక్ష్యంగా వదిలేసిన టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి, అందరికీ అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ప్రజలు దామచర్లకు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అలాగే స్థానిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని దామచర్ల వెంట నడిచారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోసూరి శ్రీను, స్థానిక నాయకులు గుర్రం శ్రీను, కుట్టుబోయిన శ్రీను, ఆవుల శ్రీను, శ్రీరాములు, పార్టీ జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

మాగుంట, దామచర్ల ఉగాది శుభాకాంక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8 : ఒంగోలులోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు శ్రీ క్రోధి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను జిల్లా ప్రజానీకం కొత్తలక్ష్యాలతో సంతోషంగా జరుపుకోవాలని మాగుంట ఆకాంక్షించారు.

మద్దిసీతాదేవినగర్, విద్యానగర్‌లో టీడీపీ శ్రేణుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

మార్టూరు, ఏప్రిల్ 8 : వైసీపీని ఇంటికి పంపి, టీడీపీకి అధికారం కట్టపెట్టాని టీడీపీ శ్రేణులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక మద్ది సీతాదేవినగర్, విద్యానగర్, మద్ది సత్యం కాలనీలలో ప్రచారం సాగింది. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, అన్ని వర్గాల ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతో మహి ళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వివరించారు. పర్చూరు నియోజకవర్గంలో మూడోసారి ఏలూరి సాంబశివరావును ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మార్టూరులో ఏలూరి చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివ నాగేశ్వరావు, తగెడ్ల ఆంజనేయులు, జంపని సాంబశివరావు, ఉప్పు గురవయ్య, జంపని రాధ, ఉప్పుటూరి రమాదేవి, కస్తూరి, శారద, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

శింగరకొండలో కదలీ ఫలార్చన



అద్దంకి, ఏప్రిల్ 8 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా సోమవారం కదలీ ఫలార్చన నిర్వహించారు. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం, అభిషేకం నిర్వహించారు. 11 ఆవృత్తాలుగా వేదపండితులు, అర్చకులు అరటిపండ్లతో కదలీ ఫలార్చన నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

మేం సిద్ధంగా లేం... మహీధర్, వేణుగోపాల్

జగన్ బస్సు యాత్ర, సభకుఇద్దరు ఎమ్మెల్యేలు డుమ్మా

నెల్లూరులో కలసి .. కందుకూరులో కనిపించని మహీధర్

రేపు దర్శిలో అనుచరులతో వేణుగోపాల్ మంతనాలు


(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మేమంతా సిద్ధం. మీరు సిద్ధమా అంటూ ఊరూవాడా తిరుగుతున్న వైసీపీ అధినేత సీఎం జగన్‌రెడ్డికి ఇద్దరు ఎమ్మెల్యేలు తాము సిద్ధంగా లేమని తేల్చిచెప్పారు. ఆయన నిర్వహించిన సభకే కాక వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు డుమ్మాకొట్టి ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు తమ మనోగతాన్ని చెప్పకనే చెప్పారు. అందులో ఒకరు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కాగా, మరొకకరు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి. శనివారం సాయంత్రం కందుకూరులో జగన్ బస్సు యాత్ర సాగగా మహీధర్ గైర్హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం దొనకొండ అడ్డరోడ్డు వద్ద జగన్ సభ, రాత్రికి దర్శిలో బస్సుయాత్ర జరిగింది. సోమవారం మధ్యాహ్నం వరకు కూడా జగన్ దర్శి సమీపంలోని చలివేంద్రం వద్ద ఉండి నియోజకవర్గ నాయకులను కలిశారు. పింఛన్‌దారులతో కూడా భేటీ అయ్యారు. కందుకూరు బస్సుయాత్రలో మహీధర్‌రెడ్డి కనిపించకపోగా, దర్శి బస్సుయాత్ర ఇతర కార్యక్రమాల్లో కూడా వేణుగోపాల్ డుమ్మాకొట్టారు. తద్వారా రెండు నియోజకర్గాల్లో వారు వైసీపీ గెలుపునకు పనిచేసేందుకు తాము సిద్ధంగా లేమని చెప్పకనే చెప్పారు.

ఆ ఇద్దరు వైసీపీ తరపున గెలుపొంది ఇప్పటికీ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న పోటీకి ఆ ఇద్దరికి జగన్ అవకాశం ఇవ్వలేదు. అయితే ఆయా సందర్భాల్లో తాడేపల్లిలో సీఎంతో వారు భేటీ అయినప్పుడ తాను పెట్టిన అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని జగన్ సూచించారు. ఇప్పటికీ వైసీపీలోనే ఉన్న ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు శని, ఆది, సోమవారాల్లో జరిగిన జగన్ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వీరిలో మహీధర్‌రెడ్డి రాజకీయంగా సైలెంట్ అయ్యే అవకాశం కనిపిస్తుండగా, మద్దిశెట్టి వేణుగోపాల్ ప్రత్యక్షంగా లేక పరోక్షంగా దర్శిలో టీడీపీ కూటమి అభ్యర్థికి మద్దతు ఇచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

నెల్లూరులో కలసి... కందుకూరులో డుమ్మా

కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి సీఎం జగన్‌ను నెల్లూరు ప్రాంతంలో కలసినట్లు సమాచారం. అంతకుముందు ఆయా సందర్భాల్లో తనను కలిసిన నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదనయాదవ్‌లతో కూడా మాట్లాడారు. అదేసమయంలో బుర్రాకు మానుగుంట, మద్దిశెట్టిలను పరిచయం చేశారు. ఆతర్వాత కందుకూరు నియోజకవర్గంలో మానుగుంట వైసీపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారంలో పాల్గొనలేదు. పైగా తనను ఏం చేద్దామని అడిగిన అనుచరులతో వేచి చూడండంటూనే మానుగంట సమాధానం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో సీఎం ఉన్నపుడు మహీధరరెడ్డి ఆయనను కలిసినట్లు సమాచారం. దాంతో ఆయన కందుకూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా పని చేస్తారన్న ఊహాగానాలు వచ్చాయి. ఆ పార్టీ నాయకులు కూడా అదే అభిప్రాయంతో ఊపిరిపీల్చుకున్నారు. శనివారం సాయంత్రం జగన్ బస్సు యాత్ర కందుకూరు వచ్చినపుడు మహీధరరెడ్డి పాల్గొనలేదు. కందుకూరులో జరిగిన రోడ్డు షోలో జగన్ బస్సు బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేసేటపుడు బుర్రా ఉన్నారే తప్పా మహీధర్‌రెడ్డి కనిపించలేదు. అంతకు ముందు సీఎంకు కాని ఇతర నాయకులకు కాని జగన్ ఏం చెప్పారో ఏమోకాని కందుకూరు కార్యక్రమాల్లో డుమ్మాకొట్టడంతో నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే అవకాశం లేదని తేలిపోయింది. కేవలం రాజకీయ విశ్లేషకులే కాక నియోజకవర్గంలోని మహీధరరెడ్డి అనుచరులు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన అసలు వైసీపీలో ఉంటారా లేకుంటే వేరే పార్టీలోకి వెళతారా? అనే ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. అందుతున్న సమాచారం మేరకు ఈ ఎన్నికల వరకు ఆయన రాజకీయంగా సైలెంట్‌గా ఉండవచ్చని తెలుస్తోంది. ఏపరిస్థితిలోను వైసీపీ అభ్యర్థి మధుసూదన్‌కు మద్దతు ఇవ్వడని కూడా బలంగా వినిపిస్తోంది.


మానుగుంట


మద్దిశెట్టి

రేపు దర్శికి రానున్న మద్దిశెట్టి

వైసీపీ అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో నియోజకవర్గానికి దూరంగా ఉన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ బుధవారం దర్శికి రానున్నారు. ఆ మేరకు అధికారికంగానే ఆయన తన అనుచరులకు సమాచారం ఇచ్చారు. తనకు టికెట్ ఇవ్వకపోగా తాను వ్యతిరేకించే బూచేపల్లిని పోటీలో ఉంచటం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వైసీపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే ఆలోచన లేదన్న సంకేతాన్ని గతంలో ఇచ్చారు. ప్రస్తుతం సీఎం కార్యక్రమాలకు దూరంగా ఉండటం ద్వారా ఆయన వైసీపీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా లేనట్లు తేల్చిచెప్పినట్లయ్యింది. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆయన అనుచరుల్లో కొందరు టీడీపీలో చేరిపోయారు. మరికొందరు రాజకీయంగా సైలెంట్ అయ్యారు. ఇదే సమయంలో ఆయన సోదరుడు శ్రీధర్ అనుచరులతో సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం ఆయన టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌తో కూడా భేటీ అయినట్లు తెలుస్తోంది. ముఖ్య అనుచరులకు టీడీపీ అభ్యర్థి గెలుపునకు సహకరిద్దామనే సంకేతం ఇచ్చినట్లు సమాచారం. టీడీపీలో చేరేందుకు కూడా ఆయన సిద్ధమైనట్లు కొందరు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వేణుగోపాల్ బుధవారం దర్శికి రానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. నేరుగా అనుచరులతో భేటీ అని చెప్పకుండా తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటారనే సమాచారాన్ని లిఖితపూర్వకంగా నాయకులకు పంపారు. తదనుగుణంగా ఆయనతో భేటీ అయ్యేందుకు ఆయన అనుచరుల సిద్ధం అవుతున్నారు. ఎమ్మెల్యే కూడా టీడీపీలో చేరే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. కాకపోయినా తన అనుచరులకు టీడీపీకి మద్దతు ఇచ్చే సందేశాన్ని ఇవ్వొచ్చని అంటున్నారు. అనుచరుల అభిప్రాయాలకు అనుగుణంగా ముందుకుపోవొచ్చు. అయితే ఆయన కూడా పార్టీ మారతారా లేక తన సోదరుడు ఇతర అనుచరులు పార్టీ మారేందుకే గ్రీన్ సిగ్నల్ ఇస్తారా అనేది బుధవారం తేటతెల్లమయ్యే అవకాశం ఉంది.

తాగునీటికి సాగర్ నీరు విడుదల

ఈనెల 12 నాటికి జిల్లాలోకి వచ్చే అవకాశం


సాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవి తాగునీటి అవసరం కోసం సాగర్ జలాలు విడుదలయ్యాయి. జిల్లాతోపాటు సాగర్ కుడికాలువ కింద ఉన్న గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం ఐదు టీఎంసీల నీటిని సాగర్ డ్యామ్ నుంచి విడుదలకు కేఆర్ఎంబీ అనుమతించింది. తదనుగుణంగా సోమవారం ఈఈ శివశంకరయ్య పర్యవేక్షణలో డ్యామ్ వద్ద కుడికాలువకు నీటిని విడుదల చేశారు. రోజుకు 5,500 క్యూసెక్కులు ప్రకారం ఈనెల 18 వరకు పది రోజుల పాటు డ్యామ్ నుంచి నీటిని వదలనున్నారు. జిల్లా సరిహద్దు కుడి ప్రధాన కాలువ 85/3 వద్దకు ఈనెల 12న నాటికి ఆ నీరు చేరుతుందని అంచనా. కాగా ఈఏడాది డ్యామ్ నుంచి ఇదే ఆఖరి విడత నీటి విడుదలగా అధికారులు చెప్తున్నారు. కుడికాలువ పరిధిలోని నాలుగు జిల్లాల్లో ఉన్న వందలాది గ్రామాలు, పట్టణాలకు కలిపి కేవలం ఐదు టీఎంసీలు నీటిని మాత్రమే వదలడం కొంత ఇబ్బందికరంగానే కనిపిస్తోంది. ఒంగోలుతోపాటు పలు పట్టణాలకు నీరిచ్చే రామతీర్థం డెడ్ స్టోరేజీకి చేరింది. దానికి కనీసం ఒక టీఎంసీ నీరు అవసరం. అలాగే రామతీర్థం దిగువ నుంచి 85/3 వరకు దాదాపు 12 సామూహిక రక్షిత నీటి పథకాలు(సీపీడబ్ల్యూ) స్కీమ్‌లకు సంబంధించి ఎస్ఎస్ ట్యాంకులు దాదాపు 50 వరకు ఉన్న నోటిఫైడ్ చెరువులకు మరో టీఎంసీ అవసరం. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తే తప్ప ఆయా వనరులకు నీరందే అవకాశం లేదు. కాగా ఇప్పటికే పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, మునిసిపల్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించారు. వారంతా అప్రమత్తంగా ఉండి ఎగువ జిల్లాల నుంచి నీరు తెచ్చుకోవడంతోపాటు జిల్లాలోని ఆయా ప్రాంతాలకు తాగునీటి వనరులకు నీటిని సక్రమంగా చేరలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎక్కడ నిర్లక్ష్యం జరిగినా జిల్లా ప్రజానీకం ఈ వేసవిలో నీటికోసం తీవ్రంగా ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి ఎదురు కానుంది.

10న వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 : మహాత్మ జ్యోతీరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం పోటీలకు సంబంధించిన వివరాలను సభ్యులు విడుదల చేశారు. ఈనెల 10వ తేదీన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల అద్దంకిలో మధ్యాహ్నం 2 గంటలకు అంబేడ్కర్ జీవితచరిత్రపై వ్యాసరచన, జ్యోతిబా పూలే జీవితచరిత్రపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5116, రూ.3116, రూ.2116... వక్తృత్వ పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3116, రూ.2116, రూ.1116 అందజేస్తామన్నారు. వివరాలకు 9603107919, 9949303085 నెంబర్లకు సంప్రదించాలని కమిటీ సభ్యులు తెలిపారు.

దహన సంస్కారానికి ఆర్థిక సాయం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 : అద్దంకిలోని కొత్త పసుమర్తిపాలెంలోని కంటారపు లాజర్ కుటుంబ దీనస్థితిని చూసి నియోజకవర్గం మాదిగ ఉద్యోగుల సంఘం సభ్యులు స్పందించారు. కొత్తపసుమర్తిపాలెంలోని కంటారపు లాజర్, సుభాషిణికి ఇద్దరు కుమార్తెలు. లాజర్ ఐదేళ్ల క్రితం మృతిచెందగా, తల్లి సుభాషిణి సోమవారం కిడ్నీ సమస్యతో మృతిచెందారు. ఆమె దహన సంస్కారాలకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని ఆప్తాలమిక్ అధికారి జే ఉమ వీరి పరిస్థితిపై వాట్సప్ గ్రూపుల్లో సమాచారం ఇచ్చారు. అద్దంకి నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సంఘ సభ్యులు వెంటనే స్పందించారు. మొత్తం రూ.45 వేలను సుభాషిణి కుమార్తె ప్రతిమకు అందజేశారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి

మార్టూరు, ఏప్రిల్ 8 : సాగర్ జలాలను గ్రామాలలో మంచి నీటి చెరువులకు జాగ్రత్తగా నింపాలని ఎంపీడీవో నితిన్, తహసీల్దార్ సంధ్యశ్రీ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో అధికారులు గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో తాగు నీటి పరిస్థితిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవిని అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో 12 మంచి నీటి చెరువులు ఉన్నాయని వాటిలో ప్రస్తుతం ఉన్న నీటి పరిస్థితి, తిరిగి సాగర్ జలాలతో నింపాల్సిన అవసరంపై ఏఈ అధికారులకు వివరాలు తెలిపారు. మేజర్ పంచాయతీ మార్టూరు మంచినీటి చెరువును సాగర్ జలాలతో నింపే విషయంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు అధికారులకు తెలిపారు. ఇదిలావుండగా మండలానికి సాగర్ జలాలు చేరడానికి రెండు మూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించండి


పమిడిపాడులో కవాతు చేస్తున్న పోలీసులు

మేదరమెట్ల ఏప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని మేదరమెట్ల ఎస్సై చంద్రశేఖర్ సూచించారు. సోమవారం మండలంలోని రావినూతల, పమిడిపాడు, తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. సభలు, సమావేశాలకు మైకు పర్మిషన్ పొందాలన్నారు. బెదిరించడం దూషించడం, వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఎండకు అల్లాడిన పెన్షన్‌దారులు

11గంటల తర్వాత బయటకు వచ్చిన సీఎం

సమావేశం తర్వాత పట్టించుకోని వైనం

ఇబ్బందులు పడుతూ వెళ్లిన వృద్ధులు

దర్శి, ఏప్రిల్ 8 : సీఎం వైఎస్ జగన్ పెన్షన్‌దారులతో సోమవారం నిర్వహించిన సమావేశం వలన ప్రయోజనం ఏమిటని పలువురు పెదవి విరుస్తున్నారు.మండుటెండకు సుదూర ప్రాంతం నుంచి వచ్చి గంటల తరబడి రోడ్లపై వేచి ఉండాల్సి వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జగన్ బస్సుయాత్రలో భాగంగా ఆదివారం రాత్రి దర్శికి వచ్చిన విషయం తెలిసిందే. మండలంలోని వెంకటచలంపల్లి వద్ద ఆయన రాత్రి బసచేశారు. అనంతరం సోమవారం ఉదయం పెన్షన్‌దారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించటంతో నియోజకవర్గం నుంచి వృద్ధులను, వికలాంగులను అక్కడకు తరలించారు. సీఎం జగన్ బస్సులో నుంచి సుమారు 11 గంటల సమయంలో బయటకు వచ్చారు. అప్పటివరకు వృద్ధులు ఎండ, వడగాల్పులకు వేచిఉండాల్సి వచ్చింది. సమావేశం వద్ద టెంట్లు వేసినప్పటికీ ఎండతీవ్రత అధికంగా ఉండటంతో అల్లాడిపోయారు. 12 గంటలకు సమావేశం ముగిసింది. అనంతరం వారు గ్రామాలకు వెళ్లేందుకు రోడ్లపై ఎండలో ఎంతో ఇబ్బందిపడ్డారు. బస్సుయాత్ర సమయంలో దర్శిలో మిగిలిన గ్రామాల్లో ఎలాంటి ప్రసంగం చేయని సీఎం వైఎస్ జగన్ పెన్షన్‌దారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయటంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాజకీయ ప్రయోజనల కోసం టీడీపీ కూటమిపై బురద జల్లే ప్రయత్నం చేశారే తప్పా వారిపై ఎలాంటి ప్రేమ లేదని అక్కడికి వచ్చిన వారు చర్చించుకున్నారు. నిజంగా వృద్ధులు, వికలాంగులపై అభిమానం ఉంటే ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది కదా.. ఎండకు ఇబ్బందిపడతారనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే అధికారుల ద్వారా పెన్షన్లు ఇళ్ల వద్ద పంపిణీ చేసి ఉండేవారని వారు చర్చించుకున్నారు. వలంటీర్లను పక్కన పెట్టడం వలన ఈ ఇబ్బంది జరిగిందని, ఈ నెపంను టీడీపీపై నెట్టే ప్రయత్నం చేసేందుకే వృద్ధులు, వికలాంగులతో సమావేశాలు నిర్వహించి కల్లబొల్లి కబుర్లు చెప్పుకుంటున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు.

సర్వర్ డౌన్‌తో పేదలకు అందని రేషన్

- ఎనిమిది రోజులైనా సగం కార్డులకే అందిన సరుకులు

- రాష్ట్రంలో విభజిత జిల్లాల్లో 24వ స్థానంలో ప్రకాశం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8 : జిల్లాలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో గంటల తరబడి మొబైల్ వాహనాల వద్ద కార్డుదారులు గంటల తరబడి ఎదురు చూడాల్సినపరిస్థితి ఏర్పడింది. రేషన్ పంపిణీ ప్రారంభించి సోమవారానికి ఎనిమిది రోజులు గడుస్తు న్నా కేవలం 53.58శాతం మందికి మాత్రమే రేషన్ దక్కాయంటే రేషన్ పంపిణీ ఏ విధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా 6,70,571 తెల్లరేషన్ కార్డులు ఉండగా సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయానికి 3,59,298 మంది కార్డుదారులకు మాత్రమే రేషన్ అందాయి. రేషన్ పంపిణీలో రాష్ట్రంలో విభజిత జిల్లాల్లో ప్రకాశం జిల్లా 24వ స్థానంలో ఉందంటే రేషన్ పంపిణీ ఏ విధంగా జరుగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సర్వర్ డౌన్ అవుతుండటంతో గంటల తరబడి వేలిముద్రలు తీసుకొని పరిస్థితి ఏర్పడింది. ఒక్కొక్కసారి వాహనదారులు సర్వర్ పనిచేయక వాహనానికి జీర్ వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పది నెలలుగా సర్వర్ డౌన్ అవుతుందని వాహనాల ఆపరేటర్లు అనేక సార్లు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ఏప్రిల్ నెలలో కూడా ఇదే విధంగా సర్వర్ పనిచేయడంతో కార్డుదారులకు సకాలంలో రేషన్ అందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్డుదారులకు సకాలంలో రేషన్ అందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బీసీ నిధులను దారిమళ్లించిన జగన్‌రెడ్డి

టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఏప్రిల్ 8 : బీసీ నిధులను రూ.75వేల కోట్లు దారిమళ్లించిన ఘనుడు జగన్ అని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలో దేవాంగపురి పంచాయతీ పరిధిలోని వాటర్ ట్యాంక్ రోడ్డులో సోమవారం జరిగిన చేనేత ఆత్మీయ సమావేశానికి కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో దుర్మార్గపాలన కొనసాగిందన్నారు. వైసీపీ ఆగడాలకు అంతేలేకుండా పోయిందన్నారు. అభివృద్ధి అనేది మచ్చుకైనా లేదు. అన్ని వర్గాలకు అందాల్సిన నిధులను దారిమళ్లించి ఆయా వర్గాలకు అన్యాయం చేశారన్నారు. ఎన్నికలల్లో టీడీపీ, జనసేన, బీజేపీ బలపరిచిన కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఓటును వేయాలని కొండయ్య కోరారు. మీ ఓటుతో అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఎన్నికల రోజు పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేప్పుడు రెండు సైకిల్ గుర్తులు వస్తాయని, వాటిపై ఓటువేసి కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను (మద్దులూరి మాలకొండయ్య)ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు నెలకు రూ.4వేలు ఇస్తామన్నారు. దివ్యాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇస్తామన్నారు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. వీటితో పాటు బీసీ డిక్లరేషన్‌తో బీసీలందరికీ ప్రత్యేక రక్షణ, అభివృద్ధి, సంక్షేమం దరిచేరతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తాము గత ఐదేళ్లలో ఎదుర్కొన్న ఇబ్బందులను, కష్టాలను కొండయ్య దృష్టికి తెచ్చారు. అన్ని సమస్యలకు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే పరిష్కారమార్గమన్నారు. నాయకులు సిద్ది బుచ్చేశ్వరరావు, శ్రీరామ్ రమేష్, గంజి పురుషోత్తమ్, కొతవరపు జనార్ధనరావు, ఘృద్వి వెంకటేశ్వర్లు, బండారు సాంబశివరావు, సజ్జ రేణుకేశ్వరరావు, ఉమ్మిటి విఠల్ నాగేంద్రం, గుంటూరు రాం బాబు, సజ్జా హేమసుందర రావు,లింగ మూర్తి పాల్గొన్నారు.

వ్యక్తికి ఏడాది జైలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 8 : నిర్లక్ష్యంగా బైక్ నడిపి వ్యక్తి మృతికి కారణమైన వ్యక్తికి అద్దంకి ఏజీఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి ఎస్.ప్రియదర్శిని జైలు శిక్ష విధించారు. 2015లో మండలంలోని సింగరకొండపాలేనికి చెందిన కంకనంపాటి కోటేశ్వరరావు(54) సరుకుల కోసం అద్దంకి వచ్చి తన మోటార్ సైకిల్‌పై శింగరకొండపాలెం వెళ్తుండగా, బల్లికురవ మండలం సూరేపల్లికి చెందిన గుర్రాల రాములు ఆటోను నిర్లక్ష్యంగా నడుపుతూ అతివేగంగా వస్తూ కోటేశ్వరరావు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావు మృతి చెందారు. అప్పటి ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేశారు. కోర్టు కానిస్టేబుల్ బీ వెంకటరమణ సాక్షులను కోర్టులో హాజరుపరచగా న్యాయవాది జాకీర్ అహమ్మద్ వాదనలను వినిపించారు. నిందితుడిపై నేరం రుజువు కాగా, న్యాయాధికారి ప్రియదర్శిని గుర్రాల రాములకు ఏడాది జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

స్వల్పంగా పెరిగిన పొగాకు ధరలు

ఒంగోలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్ హాట్, హాట్‌గానే సాగుతోంది. వ్యాపారులు బేళ్ల కోసం పోటీ పడి కొనుగోలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు గరిష్ట ధర కిలో రూ.232కు అటుఇటు ఉంటుండగా సోమవారం స్వల్పంగా పెరిగింది. కొండపిలో గరిష్టంగా కిలో రూ.237 ధర లభించగా ఇతర కేంద్రాల్లో రూ.235 లేదా రూ.236 పలికింది. నెల క్రితం దక్షిణాదిలో కొనుగోళ్ల ప్రారంభం కాగా తొలిరోజున గరిష్ట ప్రారంభ ధర కిలో రూ.230 ఇచ్చిన వ్యాపారులు అదే ధరపై కొనుగోలు చేస్తున్నారు.అదే సమయంలో గ్రేడ్‌లకు మంచి ధరలు లభిస్తుండటంతో రైతులు కూడా మేలు రకం కన్నా లోగ్రేడ్ పొగాకునే అధికంగా తెస్తున్నారు. ఆ రకం కూడా కిలో రూ.220కి అటు ఇటుగా ధర పలుకుతున్నది. గతంతో పోల్చితే లోగ్రేడ్ ధరలు భారీగానే ఉంటున్నాయి.

27న పాలీసెట్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 : పాటిటెక్నిక్‌లో ప్రవేశం కోసం జిల్లాలో ఈనెల 27వ తేదీన పాలీసెట్ నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పాలీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పోలీస్, వైద్య సిబ్బందితో లైజన్ ఆఫీసర్స్ సమన్వయం చేసుకోవా లన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, వీఆర్ పీజీ కళాశాల, అల్‌హుదా పాలిటెక్నిక్ కళాశాల, డాక్టర్ ఎస్ఆర్‌కే పాఠశాల, జగన్స్ డిగ్రీ కళాశాలల్లో, ఆత్మకూరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, కావలిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వీబీఆర్ విశ్వోదయ కళాశాలల్లో 27వ తేదీ ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను నోఫోన్ జోన్‌గా ప్రకటించామని, పరీక్ష సమయంలో ఎవరూ సెల్‌ఫోన్‌లు వినియోగించవద్దని, ఫోన్‌లు వినియోగం తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫొటో ఆధారిత ధ్రువపత్రంతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ వి.విజయ్‌కుమార్, ఫోన్ 9912342048ను సంప్రదించాలని తెలిపారు.



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో లవన్న

జిల్లాలో పటిష్ఠ ఏర్పాట్లు

కోడ్ పక్కాగా అమలు

నెల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్‌ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ సేతు మాధవన్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌కు పది రోజుల ముందుగానే ఎన్నికల ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు చెప్పారు. కోడ్ ఉల్లంఘనపై వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. సీ విజిల్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 257 ఫిర్యాదులు రాగా వాటిని వచ్చిన వంద నిమిషాల్లోనే పరిష్కరించామని చెప్పారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లావ్యాప్తంగా 18 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.7.50 లక్షల విలువైన 1200 లీటర్ల మద్యం, రూ.92 లక్షల నగదు, రూ.88 లక్షల విలువైన బంగారం, వెండి, రూ.7 లక్షల విలువైన ఇతర వస్తువులతో కలిపి మొత్తం రూ.1.98 కోట్ల విలువైన సామగ్రిని సీజ్ చేసినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో మూడు స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్స్ పని చేస్తాయని ప్రకటించారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు ఇప్పటివరకు 27 కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సీఐలు, ఎస్సైలు పర్యటిస్తూ గ్రామపెద్దలతో మాట్లాడుతూ వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీఐపీఆర్వో కే సదారావు, డీపీఆర్వో టీ మోహన్‌రాజు, ఇంజనీర్ ఏ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎస్పీ

చికెన్ ధర పైపైకి..

ఆకాశమే హద్దుగా చికెన్ ధర ఎగబాకుతోంది. ఎండలు మండుతున్నవేళ ఆ ప్రభావం చికెన్ ఉత్పత్తులపై పడింది. దీంతో ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గతవారం కిలో రూ.220 పలికిన ధర రూ.80 చేరి కిలో రూ.300కు చేరింది. నెల్లూరులో బ్రాయిలర్ రూ.280 ఉండగా, స్కిన్‌లెస్ 310 రూపాయలకు విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున కోళ్లు చనిపోతాయని, డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో ధరలు కూడా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

\- ఉదయగిరి



విద్యుత్ కోటా పెంపు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 8 : వేసవిలో పెరిగిన విద్యుత్ వినియోగానికి తగ్గట్టు కోటా పెంచినట్లు ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కావడంతో ప్ర జలంతా ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కువగా వినియో గించడం వల్ల విద్యుత్ వాడకం ఎక్కువైనట్లు తెలిపారు. దీంతో డిమండ్‌కు తగ్గట్టు కోటా పెంచాలని సీఎండీ సంతోషరావును కోరామని, ఆ మేరకు రోజుకి 12 మిలియ న్ యూనిట్లు ఉన్న కోటాను 15మిలియన్ యూనిట్లకి పెంచారని తెలిపారు. మరో వైపు లోఓల్టేజ్ ఉన్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



క్రోధి ఉగాది

కొత్త ఉషస్సునివ్వాలి!

- నేడు తెలుగు సంవత్సరాది
- షడ్రుచుల పచ్చడి ప్రత్యేకం
- గ్రహ ఫలితాలు ఆందోళనకరమంటున్న పండితులు
- ఎన్నికల ఏడాది హడావిడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ పఠనం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 : కొత్త ఏడాది ప్రారంభాన్నే యుగాది.. ఉగాదిగా పిలుచుకుంటాం. ఇది తెలుగువారి నూతన సంవత్సరాది. నేటి నుంచి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది ప్రారంభమవుతోంది. షడ్రుచుల పచ్చడి ఈ పండుగకు ప్రత్యేకం. సంతోషము, దుఃఖ ము, కష్టము, నష్టము.. ఇలా అన్నింటి సమ్మేళనమే జీవితమని తెలియజేప్పేందుకు, దానిని ఆచరించేందుకే ఈ ఆరు రుచుల పచ్చడిని ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇది ఆరోగ్యపరంగానూ ఎంతో ప్రాముఖ్యత కలిగినది. వేప పువ్వు, మామిడి ముక్కలు, కొత్త బెల్లం, కొత్త చింతపండు, ఉప్పు, మిరియాలతో ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. ఇది వాతావరణ మార్పుల వల్ల కలిగే అనారోగ్యాన్ని హరించి ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఏడాది పొడవున మనలో కలిగే సంతోషం (తీపి), దుఃఖం (చేదు), కోపం (కారం), భయం (ఉప్పు), విసుగు (చింతపండు), ఆశ్చర్యం/సంభ్రమం (మామిడి) వంటి భావాలకు ఈ ఆరు పదార్థాలు ప్రతీకగా చెబుతారు. ఇక, ఉగాది పండుగనాడు మరో ప్రత్యేకం పంచాంగ శ్రవణం. నూతన ఏడాది వర్షాలు, పాడిపంటలు, రాజ్యపాలన వంటి వాటిని గ్రహస్థితుల ఆధారంగా అంచనా వేసి పండితులు వివరిస్తారు. అయితే రాబోవు శ్రీక్రోధి నామ సంవత్సరంలో గ్రహస్థితి, గోచార ఫలితాలు ఆందోళనకరంగా ఉంటాయని సిద్ధాంతులు విశ్లేషిస్తున్నారు. క్రోధి అంటేనే క్రోధం(కోపం) అని అర్థమని, ఈ సంవత్సరంలో ప్రజలు కోపం, ఆవేశం కలిగి ఉంటారని తెలియజేస్తున్నారు. ఈ ఏడాది రాజు కుజుడు కావడంతో మనుషుల మధ్య, దేశాల మధ్య శత్రుత్వం పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే.. మంత్రి, సైన్యాధిపతి, ధాన్యాధిపతి కావడంతో వర్షాలు తక్కువగా కురిసి, పంటల సాగు తగ్గుతుందని, దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొంటుందని, ప్రజా జీవనం భయభ్రాంతులతో నిండి ఉంటుందని, వ్యాధులు ప్రబలుతాయని అంచనా వేస్తున్నారు. శశ్యాధిపతి కుజుడు కావడంతో మిర్చి, ఎర్ర శనగలు, కందులు వంటి పంటలు బాగా పండుతాయంటున్నారు. అయితే, గ్రహ ఫలితాలు ఎలా ఉన్నా.. నూతన సంవత్సరం ప్రజలందరి జీవనస్థితి మెరుగుపడాలని, అందరికీ తగిన అవకాశాలు రావాలని, అందరి జీవితాల్లో కొత్త కాంతులు విరియాలని ఆశిద్దాం.



● ఆలయాల్లో ఉత్సవాలు

ఉగాది పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే పంచాంగ పూజ, పంచాంగ శ్రవణం జరపనున్నారు.

కొత్త ఏడాది తొలి పండుగ సందర్భంగా కొత్త వ్యాపారాలు ప్రారంభించడం, కొత్త వస్తువులు కొనుగోలు చేయడం కొందరు ఆనవాయితీగా అనుసరిస్తుంటారు. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం రాత్రి నగరోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు.

- రాజ్యపూజ్యమెవరికి.. అవమానం ఎవరికి!?
- ఎన్నికల సమరంలో అభ్యర్థుల జాతకం ఎలా ఉంటుందో!?

ఉగాది అంటే తెలుగు సంవత్సరాది మాత్రమే కాదు... జనబాహుళ్యంలో జాతకాలు తెలిపే రోజు కూడానూ.. ఈ సందర్భంగా ఆ ఏడాది పంటలు మొదలు ప్రకృతి వైపరీత్యాల వరకు, పాలకుల స్థితిగతులు మొదలు... వ్యక్తుల రాశి ఫలాల వరకు అన్ని ఉగాది నుంచే ఆరంభం అవుతాయన్నది తెలుగువారి విశ్వాసం. ఆ క్రమంలోనే ఉగాది రోజు నుంచి రాష్ట్ర స్థితిగతులు ఎలా ఉండబోతాయన్న విషయాన్ని పంచాగ శ్రవణం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసుకుంటుంది. సాధారణ పరిస్థితుల్లో వచ్చే ఉగాదికే ఇంత ప్రత్యేకత ఉంటే.. ఇక సార్వత్రిక ఎన్నికల ముందు వచ్చే ఉగాదికి ఇంకెంత ప్రాధాన్యత ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఎన్నికల బరిలో దిగిన నాయకుల రాశి ఫలాలు ఎలా ఉండబోతాయన్న విషయంపైనే ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపుతారు. పాఠకుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రజ్యోతి అందిస్తున్న సరదా ఎన్నికల పంచాంగం ఇది. రాశులు, జన్మనక్షత్రాల ఫలితాలను పక్కన పెట్టి నియోజకవర్గాల వారీగా నెలకొన్న తాజా పరిస్థితిని అంచనా వేస్తూ అందిస్తున్న కథనం. - నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

రాశి, జన్మనక్షత్రాల ఫలితాలు అటుంచితే..
రాజకీయక్షేత్రంలో జయాపజయాలు ఎవరివో!
ఆంధ్రజ్యోతి అందిస్తున్న సరదా ఎన్నికల పంచాంగం



ఎవరి గ్రహస్థితి ఎలా ఉందో..?

ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి రెండు నెలల క్రితమే గురు మహర్దశ మొదలయ్యింది. ఏ కార్యంలో విజయం సాధించాలన్నా గురు బలం చాలా అవసరం. ఇది ఆయనకు పుష్కలంగా కనిపిస్తోంది. రాజయోగ కారకుడైన రవి ఈయనకు అనుకూలంగా ఉన్నారు. ఆ కారణంగానే ఈయన రెండు నెలల క్రితం తన స్థానాన్ని మార్చుకున్నారు. రాజయోగ కారుకులైన రవి, గురువు, శుక్రుడు ఈ ముగ్గురు ఈయనకు అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఆ క్రమంలోనే ఈయన పట్ల ప్రజలు సానుకూలత వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈయన జాతకం ప్రకారం ఎన్నికల్లో నక్కజిత్తులను ఎదుర్కోవలసి ఉంటుంది. జిత్తులమారి ఎత్తుగడల్లో ఈయనకు కొంత చికాకులు కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక అధికార వైసీపీ నుంచి పోటీలో ఉన్న విజయసాయి రెడ్డికి ప్రస్తుతానికి గ్రహస్థితి బాగానే ఉన్నా మే తరువాత అంత అనుకూలంగా కనిపించడం లేదు. మే ఆరంభంలో గురువు స్థానం మారనున్న కారణంగా బలహీనపడనున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రభావం ఇప్పటి నుంచే మెల్లమెల్లగా కనిపిస్తోంది. సొంత సైనికులు ఒక్కొక్కరుగా శత్రుకూటమిలో చేరిపోతున్నారు. అర్థ బలం ఎంత ఉన్నా కార్యకర్తల బలం తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. నీచగ్రహాలైన కుజుడు, శనిలు రాజ్యాధికారానికి అడ్డుపడే సూచనలు కనిపిస్తున్నాయి. వీటికితోడు ఛాయాగ్రహాలైన రాహు, కేతువులు వీరితో జత చేరడం మరింత ఆందోళన కలిగించే అంశం.

నెల్లూరు సిటీ : టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ. ఈ వృశ్చిక రాశి వారికి పరిస్థితి చాలా అనుకూలంగా ఉంది. రాజయోగం లక్షణాలు బలంగా ఉన్నాయి. ఈ రాశివారితో శత్రుత్వ పెట్టుకున్నవారికి స్థానచలనం తప్పదని జాతక చక్రం చెబుతోంది. ఎన్నికల సమరంలో తలపడాల్సిన శత్రురాజు తన దిశ మార్చుకొని యుద్ధం నుంచి తప్పుకున్నారు. ఈ ఘటనతోనే ఈయన విజయం దాదాపుగా ఖరారయ్యిందని రాజ్యపౌరులు భావిస్తున్నారు. ఈయనకు రాజయోగ కారకులైన రవి, గురువు, శుక్రునితోపాటు అన్ని గ్రహాలు అనుకూల దిశగా కదులుతున్నాయి. ప్రత్యర్థి అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌కు అన్ని గ్రహాలు బలహీనంగా ఉన్నాయి. బుధుడు ప్రభావంతో ఊహించని విధంగా టికెట్ లభించినా రాజయోగ కారకులైన మూడు గ్రహాలు ఈయన వైపు వక్రంగా చూస్తున్నాయి. గతంలో నాయకుడు చేసిన తప్పిదాలు రాహు, కేతు రూపంలో ఖలీల్‌ను వెంటాడనున్నాయి.

నెల్లూరు రూరల్: తెలుగుదేశం అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఏడాది క్రితమే శుక్ర మహర్దశ మొదలయ్యింది. ప్రస్తుతం గురువు కూడా అనుకూలంగా మారడంతో బలమైన వ్యక్తులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పొంగూరు నారాయణలు స్నేహితులుగా చెరోవైపు నిలబడి సమర శంఖం పూరిస్తున్నారు. స్నేహబంధం కూడా తోడుగా నిలవడంతో ఈయనకు అన్ని అనుకూలతలు కనిపిస్తున్నాయి. ఈయన ప్రధాన ప్రత్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డి. ఈ రాశి వారు చాలా లోపలి మనుషులు. చాపకింద నీరులా పనులు చక్కబెట్టుకోవడం వీరి నైజం. అర్థబలం, జిత్తులమారి ఎత్తుగడలతో బలమైన పోటీదారుగా బరిలో నిలబడ్డారు. అయితే మే ఆరంభానికి ఈయనకు కూడా గురుబలం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. రాహుకేతుల ప్రభావంతో ఈయన ఎత్తుగడలు పని చేయకపోవచ్చు.

కోవూరు : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. ఈమెకు రాజయోగకారుడైన రవి ఈమె జన్మనక్షత్రంలో ఉన్నారు. ఎన్నికల సమరంలో ఈమె బలం పుంజుకుంటారు. గురువు స్థానంలో భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎన్నికల సారథ్యం వహిస్తున్నారు. యుద్ధం ఆరంభం కాకమునుపే ఈమె ఫలితాలపై ప్రజలు ఒక అభిప్రాయానికి వచ్చేశారు. ఈమె ప్రధాన పోటీదారు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్వతహాగా యుద్ధ వీరుడు. ఎన్నో యుద్ధాలు చేసిన అనుభవం ఉన్నవారు. వ్యూహ రచనలో దిట్ట. అయితే ఈయన గ్రహస్థితి అంత బాగాలేదు. ఆ కారణంగానే ఎన్నికల యుద్ధంలో తనతో తలపడే ప్రత్యర్థి ఊహించని రీతిలో మారిపోయారు. మిత్రులు అనుకున్నవారే శత్రువులుగా మారిపోయారు.

కావలి : తెలుగుదేశం అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి. ఈయనకు గురుబలం బాగా ఉన్న కారణంగా టిక్కెట్టు సాధించుకున్నారు. అయితే కుజుడు, శని గ్రహాలు ఈయనకు అనుకూలంగా లేవు. ఆ ప్రభావంతో సొంత సైన్యంలో ఐక్యత లోపించింది. ఉగాది తరువాత గ్రహస్థితి మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈయన ప్రత్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి శుక్రుడు బలంగా ఉన్నా రవి, గురు ప్రభావాలు తక్కువగా కనిపిస్తున్నాయి. పైగా ఛాయాగ్రహాలైన రాహుకేతువులు వక్రంగా చూస్తున్నాయి. వీటి ప్రభావంతో గతంలో చేసిన పొరపాట్లు ఓటు సమయంలో ప్రత్యర్థులకు అనుకూలంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

ఉదయగిరి : ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇద్దరూ యుద్ధ రంగానికి కొత్త వారే. ఎవరి ఎత్తులు వారు వేస్తున్నారు. సర్వశక్తులు మోహరిస్తున్నారు. అయితే తెలుగుదేశం అభ్యర్థి కాకర్ల సురేష్‌కు రాజయోగకారకులైన రవి, గురువు, శుక్రుడు అనుకూ లంగా ఉండగా ప్రత్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డికి శుక్రుడు బలంగా ఉన్నారు. ముందుతరం చేసిన తప్పులు శాపాలై రాహుకేతువుల రూపంలో వెంటాడే సూచనలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఉదయగిరి రణభూమిలో హోరాహోరి వాతావరణం కనిపిస్తోంది.

ఆత్మకూరు : తెలుగుదేశం అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి తలపడుతున్నారు. ఈ ఏడాది మార్చి వరకు ఈయనకు గ్రహస్థితి బాగా లేని కారణంగా రాజకీయంగా చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. ఏప్రిల్ నుంచి ఈయనకు గురువు అనుకూలించాడు. ఆత్మకూరులో గతంలో చేసిన అభివృద్ధి పనులు ఈయనకు బాగా అనుకూలిస్తున్నాయి. మే నాటికి ఈయనకు రవి, శుక్రుడు కూడా అనుకూలించనున్నాడు. ప్రత్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి గ్రహస్థితి పర్లేదు. అయితే ఏప్రిల్ నెలాఖరుకు ఈయనకు కుజుడు, శని గ్రహాలు వక్రించే సూచనలు కనిపిస్తున్నాయి. దీనివల్ల అశాంతి, ఆందోళన, తిరుగుబాట్ల ప్రభావాలు ఈయన్ను చికాకుపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

సర్వేపల్లి : గతానికి భిన్నంగా తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల రణ క్షేత్రంలో విజృంభించనున్నారు. మారిన గ్రహాలు ప్రజల్లో ఆయన పట్ల ప్రత్యేక అభిమానం, సానుభూతి ప్రదర్శించే అవకాశాలను సూచిస్తున్నాయి. గతంలో చేసిన మేళ్ల తాలూకు ప్రభావం, ప్రత్యర్థి అనుసరించిన అణచివేత విధానం సోమిరెడ్డికి బాగా ఉపయోగపడనున్నాయి. ఈయన ప్రత్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నివిధాలా బలవంతుడే అయినా గ్రహస్థితి మాత్రం అంత బలంగా కనిపించడం లేదు. కుజ, శని, రాహు, కేతు గ్రహాల వక్రదృష్టి కారణంగా ఈయనకు చికాకులు కలిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఊహించని సమాచారాలు ఈయన్ను కలవరపాటుకు గురిచేసినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

వైసీపీ ఓ వికృత పార్టీ.. త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారు!

● ఓడిపోతామన్న భయంతోనే అసత్య ఆరోపణలు : వేమిరెడ్డి దంపతుల ఆగ్రహం

కొడవలూరు, ఏప్రిల్ 8 : వైసీపీ ఒక వికృత పార్టీ అని, ఆ పార్టీకి, ఆ పార్టీ ముఖ్యనాయకులకు త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. సోమవారం నార్తురాజుపాళెంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. అంకుముందు వేమిరెడ్డి దంపతులకు పార్టీ నాయకులు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాము పార్టీ మారినప్పటి నుంచి వైసీపీ నాయకులు చీప్ పాలిటిక్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. తాజాగా ఓ ఫేక్ ఆడియోను విడుదల చేసి వికృతానందం పొందుతున్నారని మండిపడ్డారు. వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి వయసుకు ఇలాంటి చీప్ పాలిటిక్స్ ప్లే చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హుందా రాజకీయలు చేస్తే ప్రజలు హర్షిస్తారని, వారే తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్ రెడ్డి, రాజేంద్ర తదితరులు తమపై అసత్య ప్రచారం చేస్తూ ఓ తప్పుడు ఆడియోను రిలీజ్ చేశారని దాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఢిల్లీ నుంచి ఎంపీ అభ్యర్థిగా ఇక్కడికి వచ్చిన విజయసాయి రెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పి ఓట్లు అభ్యర్థించాలని డిమాండ్ చేశారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిపై పోటీకి సరైన నాయకుడు లేక విశాఖ నుంచి ఇంపోర్టు చేసుకున్న విజయసాయి పిచ్చిపట్టినట్లుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం వైసీపీకి చెందిన కిరణ్ కుమార్, బండి అనిల్ కుంభ్లే తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, మందిపాటి ప్రవీణ్ కుమార్, ఇరువూరి శ్రీధర్‌రెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్, తువ్వర ప్రవీణ్, నాసిన ప్రసాద్, మందిపాటి రమణారెడ్డి, దిలీప్ రెడ్డి, పాటూరి రమేష్, జనసేన నాయకుడు కిషోర్ పాల్గొన్నారు.



వేమిరెడ్డి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఓటమి భయంతోనే వైసీపీ అసత్య ప్రచారాలు!



కాకర్ల సురేష్‌కు మద్దతు తెలుపుతున్న చాకలికొండ గ్రామస్థులు



ట్రాక్టర్ నడుపుతున్న కాకర్ల

- సైకిల్ గుర్తుకు ఓటేయండి.. అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకోండి
- ఇంటింటి ప్రచారంలో కాకర్ల సురేష్

వింజమూరు, ఏప్రిల్ 8: ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రసారాలు చేస్తున్నారని వాటిని తిప్పి కొట్టాలని ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని చాకలికొండ, జనార్దనపురం పంచాయతీల్లో పల్లెపల్లెకు ఇంటింటి ప్రచారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశాన్ని గెలిపించాలని అభ్యర్థించారు. ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి మాత్రమే పల్లెల్లో కనిపిస్తుందని వైసీపీ పాలనలో ఒరిగిందేమీ లేదన్నారు. ఐదేళ్ల రాష్ట్రం అధోగతి పాలై 20 సంవత్సరాలు వెనక్కిపోయిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. 40ఏళ్లుగా పాలిస్తున్న మేకపాటి కుటుంబంతో అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉంది అన్న చందంగా ఉందన్నారు. మార్పు రావాలంటే అజాతశత్రువు, అపర భగీరథుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా, అదేవిధంగా ట్రస్టు ద్వారా మీకు అనేక సేవలు చేస్తూ మీ మనిషిగా ఉన్న నన్ను గెలిపించాలని కోరారు. ప్రతి పల్లెల్లో టీడీపీ నాయకులు, అభిమానులు కాకర్ల సురేష్‌ను శాలువా, గజమాలలతో సత్కరించారు. వైసీపీ నాయకులు మైండ్ గేమ్ ఆడుతున్నారని, దాన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ దంతులూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతు బిడ్డగా మారిన కాకర్ల

చాకలికొండ, బత్తినవారిపల్లి, జనార్దనపురం గ్రామాల్లో ప్రచారంలో భాగంగా సోమవారం ట్రాక్టర్ నడిపి రైతు బిడ్డగా మారారు. చంద్రబాబునాయుడు హయాంలో రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లను పనిముట్లను ఇచ్చి రైతులను ప్రోత్సహించారని ఈ ప్రభుత్వంలో రైతులను పట్టించుకునే నాథుడే లేడన్నారు.

నేడు ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 8: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక చిన్నమసీదు ప్రాంగణంలో మంగళవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం సోదరులంతా కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

సీతారామపురం: పట్టణంలోని జామియా, బసినేని పల్లి, రంగనాయుడుపల్లి మసీదుల్లో బొల్లినేని వెంకటరామారావు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు సోమవారం ముస్లిం సోదరులు తెలిపారు. సాయంత్రం జరిగే కార్యక్రమానికి మండలంలోని ముస్లిం సోదరులందరూ విచ్చేసి విందును స్వీకరించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాయం వద్ద చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

అనంతసాగరం, ఏప్రిల్ 8: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం అధికారులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండతీవ్రత పెరుగుతుండగా కార్యాలయంకు వచ్చే వారి దాహార్తి తీర్చేలా మంచినీటి వసతి కల్పించామన్నారు. కార్యక్రమంలో డీటీ గిరీష్, ఆర్ఐ రమేష్, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

వైసీపీ నాయకుల సమావేశం

అనంతసాగరం, ఏప్రిల్ 8: వైసీపీతో పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అనంతసాగరం ఎంపీపీ సంపూర్ణమ్మ, నాయకులు బత్రేడ్డి జనార్దన్‌రెడ్డి, అంకిరెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం వారు పార్టీ నాయకులతో కలసి ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచు శోభ, బీ నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై సంగమేశ్వరుడు



సంగం, ఏప్రిల్ 8: స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి (మూడోరోజు) అశ్వవాహనంపై సంగమేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు టంగుటూరి గోపాలకృష్ణ స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి గజపూలమాలలు వేశారు. అనంతరం ఉత్సవాన్ని సంగం పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమానికి కోట సులోచనమ్మ, వారి కుమారులు వంశీకృష్ణ, సుధీర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయం గర్భగుడిలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పూలంగిసేవ నిర్వహించారు.

తరుణవాయి జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

సంగం, ఏప్రిల్ 8: తరుణవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఉషారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నాడు-నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల పనితీరుపై 9వ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంఈవోలు జానికీరామ్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఉన్నారు.

హౌసింగ్ కార్యాలయంలో..

సంగం: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్‌రాజు రికార్డులు తనిఖీ చేశారు. సంగంలోని జగనన్న కాలనీలోని ఇళ్లకు విడుదలైన సిమెంట్ పక్కదారి పట్టించారని ఏఈపై ఆరోపణలు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో కార్యాలయంలో ఏఈ లేరు. ఆయన వెంట డీఈ ముస్తహర్ ఉన్నారు.

ఆత్మకూరు బీఎస్పీ అభ్యర్థిగా కృష్ణ



సంగం, ఏప్రిల్ 8: ఆత్మకూరు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంగం గ్రామానికి చెందిన టి.కృష్ణ ఎంపికైయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానికీప్రసాద్ ఒక ప్రకటనలో విడుదల చేశారు. సంగం గ్రామానికి చెందిన వ్యక్తి ఒక జాతీయ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక కావడం ఇదే తొలిసారి కావడంతో గ్రామంలో ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనసేనలో యువకుల చేరిక

సంగం: తరుణవాయికి చెందిన పలువురు యువకులు సోమవారం ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ సమక్షంలో జనసేనలో చేరారు. మావిళ్ల ఆనందరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి శ్రీధర్ కండువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రావణ్, శ్రీకాంత్, హేమసాగర్, వెంకటేష్ ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో నలిశెట్టి శ్రీధర్, మావిళ్ల ఆనంద్‌రావు

దళితులను మోసం చేసేందుకే బటన్ నొక్కుడు..



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

అల్లూరు, ఏప్రిల్ 8 : సీఎం జగన్ ఉత్తుత్తి బటన్లను నొక్కడం దళితులను మోసం చేసేందుకేనని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. సోమవారం సాయంత్రం పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, ఈబీసీ నేస్త, రైతు సంక్షేమ పథకాలు అంటూ జగన్ ఉత్తుత్తి బటన్ నొక్కుతున్నారని, ఇప్పటివరకు పైసా కూడా లబ్ధిదారులకు అందలేదన్నారు. ఇప్పటికైనా మాయమాటలు మాని ప్రజలకు చేరాల్సిన నగదును వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాదు ప్రసాద్, వెంకయ్య, గోళ్ల దాసు, దర్శిగుంట వెంకయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

671పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 8: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 797పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 671 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-2, నో బిడ్-95, సీఆర్-15, జంపింగ్‌లాట్స్-14 కారణాలతో 126బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.229.15గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి సదస్సుకు తరలిన కార్యకర్తలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 8: గుంటూరులో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్రస్థాయి సమావేశానికి దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యకర్తలు సోమవారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వారి వెంట ఎంఎస్‌పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, నాయకులు గంగపట్ల సింహాద్రి, గొల్లపల్లి మోహన్‌రావు, తాతిపూడి డేవిడ్, చేవూరి రవితేజ, బర్రె అర్జున్, కొసినపోగు రవి ఉన్నారు.

వైసీపీ అరాచకపాలనకు చరమగీతం పాడదాం

ఆత్మకూరు ఏప్రిల్ 8: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చమరగీతం పాడేందుకు సమయం ఆసన్నమైందని, మళ్లీ జగన్ అధికారం కోసం తహతహలాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కె.రాజు, ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆత్మకూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటీశ్వరుల మధ్య సామాన్యులు అయిన తాము కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్నామని, ప్రజలు ఆదరించాలని వారు కోరారు.

భారీ మెజారిటీతో టీడీపీని గెలిపించాలి

బిట్రగుంట (దగదర్తి) ఏప్రిల్ 8: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కావలి నియోజకవర్గనేత మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం మనుబోలుపాడు, బాడుగులపాడు పంచాయతీల్లో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రాత్రి కాట్రాయపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఇరుకుగా తూముల ఏర్పాటు

- వైసీపీ నేతల తీరుతో రైతుల ఆగ్రహం



తూము ఏర్పాటుకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు

కావలి రూరల్, ఏప్రిల్ 8 : కావలి మండలం ఆముదాలదిన్నెలో చెరువు నుంచి నీటి పారుదలపై ఏర్పాటు చేస్తున్న చిన్న తూములను చూసి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పనులు చేస్తున్న వైసీపీ నేతలపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తుమ్మలపెంట రోడ్డులోని ఆముదాలదిన్నె క్రాస్ రోడ్డు నుంచి బోగోలు మండలం జడగోగుల వరకు ఇటీవల రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఆముదాలదిన్నె వద్ద పాత రోడ్డు కింద నీటి పారుదలకు ఉన్న తూములు తొలగించి, వాటిని విస్తరించి ఏర్పాటు చేయకుండానే రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ఇటీవల ఆ రోడ్డుపై వెళ్తున్న సుబ్బారావు అనే రైతు తూముల వద్ద కింద పడి గాయపడ్డాడు. ఈ తంతు చూసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో పెద్ద తూములు ఏర్పాటు చేయకుండా నిర్మాణం చేపట్టడంపై రైతులు ఆగ్రహిస్తున్నారు.

సంపద సృష్టి.. ప్రజా సంక్షేమం బాబుకే సాధ్యం : కావ్య



కావలి : మద్దూరుపాడులో మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి | అల్లూరు పోలేరమ్మ పూజల్లో పాల్గొన్న బీదగిరిధర్, చందన్‌రెడ్డి

కావలి, ఏప్రిల్8: సంపద సృష్టించి దాన్ని ప్రజా సంక్షేమానికి ఖర్చుచేయడం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికే సాధ్యమని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. మద్దూరుపాడులోని ఒకటవ వార్డులో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, అవి ఆలస్యమైతే నిరుద్యోగ భృతి అందచేస్తామన్నారు. అలాగే వైసీపీ రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ పథకాలను కూడా పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోతుగంటి అలేఖ్య, కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

- **స్టిక్కర్లతో వంచన**

కేంద్ర పథకాలకు రాష్ట్రప్రభుత్వం స్టిక్కర్లను అంటించి సీఎం జగన్ ప్రజలను వంచించారని కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో కావ్యతోపాటు బీజేపీ, జనసేన నాయకులు గుత్తికొండ కిషోర్, పొబ్బాసాయి, కే. బ్రహ్మానందం మాట్లాడారు. రూ.2.70 లక్షల కోట్ల డీబీటీలో సగానికిపైగా కేంద్రం నిధులేనన్నారు. రేషన్ పంపిణీలో కూడా సగానికిపైన కేంద్రం నిధులేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా 8రకాల సరుకులు పంపిణీ చేయగా, జగన్‌రెడ్డి ప్రభుత్వం బియ్యానికే పరిమితం అయిందన్నారు.

చామదలలో టీడీపీ ప్రచారం

జలదంకి: మండలంలోని చామదల గ్రామంలో మూడురోజులుగా టీడీపీ నేతలు మునగాల వెంకటేశ్వరరెడ్డి, దేవరపల్లి క్రిష్ణారెడ్డిల ఆధ్వర్యంలో మహిళా నేతలు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కాకర్ల బంధువులు కడియాల పద్మావతి, పరిమి సుజాత, పరిమి శ్రీహరినాయుడుగ్రామానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంతోనే కాలనీల అభివృద్ధి

అల్లూరు : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలోని కాలనీలు అభివృద్ధి చెందాయని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని చెర్లోసంపం, గాంధీకాలనీ, వడ్డిపాలెం, కట్టకింద అరుంధతీయవాడ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఏ చందన్‌రెడ్డితో కలసి ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా పోలేరమ్మకు పూజలు నిర్వహించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిల్ గుర్తుకి ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, బిట్రగుంట చైతన్యరెడ్డి, తిరువీధి అనూరాధ, పద్మ, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి



కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

లింగసముద్రం, ఏప్రిల్ 8 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు చెప్పారు. సోమవారం మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం, వీఆర్ కోట గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసైనికులకు ఆహ్వానమేది ?

కావలి : జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్‌కాని, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికాని జనసైనికులను పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించటంలేదని పలువురు జనసైనికులు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం 32,34,39 వార్డుల ఇన్‌చార్జిలు బెల్లంకొండ మస్తాన్ బాబు, మంగళగిరి శ్రీనివాసులు, పీ. రఘువర్మ సోషల్ మీడియా ఇన్‌చార్జిలు పీ బాలు, కాకుమాని ఫణేంద్ర, వెంకటక్రిష్ణ తదితరులు విలేకరులతో మాట్లాడారు.పార్టీ కార్యక్రమాలకు, ఎన్నికల ప్రచారాలకు ఎలాంటి సమాచారం ఉండటంలేదన్నారు. పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వకపోతే వారికి వ్యతిరేకంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు.

టీడీపీలోకి పలు వైసీపీ కుటుంబాలు



టీడీపీలో చేరిన వారితో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 8 : ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ మర్రిచెట్లు సంఘంలోని పలు ఎస్టీ కుటుంబాలవారు, ఉలవపాడులోని హైస్కూల్ సంఘానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సోమవారం టీడీపీలో చేరారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు వారందరికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడగూ టీడీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, పార్టీ గెలుపుకోసం పనిచేసి సైకిల్ గుర్తుపై ఓటు వేయించేలన్నారు. కార్యక్రమంలో కరేడు, ఉలవపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, వాసు, ఉలవపాడు ఎంపీటీసీ యలమంద, నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, మెట్టా శ్రీనివాసులరెడ్డి, వెంకట్రావు, శ్రీధర్, వెంకటరమణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో టీడీపీ నేతలు



నమాజులో పాల్గొన్న వేమిరెడ్డి కోటారెడ్డి, రఫీమాలిక్ తదితరులు

అల్లూరు, ఏప్రిల్ 8: ఇఫ్తార్ విందులో సోమవారం సాయంత్రం అల్లూరు టీడీపీ నాయకులు,వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ నెల అతి పవిత్రమైనదని, ఈసందర్భంగా వారికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన నమాజులో పాల్గొన్నారు. కార్యక్రమంలో రఫీమాలిక్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, అరగల రమణయ్య, బండి శ్రీనివాసులు రెడ్డి, ఏలూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవితకు బంగారుబాట



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ డీఈవో, పాఠశాల సిబ్బంది.

కావలి రూరల్ : విద్యతోనే పిల్లల భవితకు బంగారుబాట వేయవచ్చని డిప్యూటీ డీఈవో పీ రఘురామయ్య పేర్కొన్నారు. స్థానిక శాంతినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో ఇటీవల విడుద లైన ఇంటర్నేషనల్ టాలెంట్‌సెర్చ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జెనిత్‌కు డిప్యూటీ డీఈవో చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం కొండారెడ్డి, ప్రిన్సిపాల్‌జీ శైలేష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. అనంతరం పాఠశాల సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కావలిని అభివృద్ధి చేయడమే సుధాకర్ లక్ష్యం



స్థానికులతో మాట్లాడుతున్న పసుపులేటి వెంకటేశ్వర్లు

బిట్రగుంట (దగదర్తి), ఏప్రిల్ 8: కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే పసుపులేటి సుధాకర్ ప్రధాన లక్ష్యమని ఆయన సోదరుడు పీ.వెంకటేశ్వర్లు అన్నారు. దగదర్తి మండలం తురిమెర్ల, పెద్దపుత్తేడు, ఉప్పలపాడు గ్రామాల్లో సోమవారం స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బరిలో ఉన్న వివిధ పార్టీల నేతలు పదవుల కోసం పాకులాడేవారేనని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధే ధ్యేయంగా సుధాకర్ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఉప్పురామారావు, గుంజి చెంచురామయ్య, రమణయ్య, రవి, వెంకటేశ్వర్లు, చిన్నవెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరవపాలెంలో అంతోని ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

గిరిజనులకు రంజాన్ విందు

కావలిటౌన్ : విజయభారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం బుడమగుంట గిరిజనకాలనీ వాసులకు రంజాన్ విందు అందించారు. ట్రస్ట్ చైర్మన్ కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్ బాషా, రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాదరావులు పాల్గొని బిర్యానీ పొట్లాలు, అరటి పండ్లు, మిఠాయిలు అందించారు. వారు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా కిరణ్, ఆయన మిత్రులు జమీల్‌బాషా సహకారంతో గిరిజనులకు బిర్యానీ విందు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుడ్‌మెన్ బ్రహ్మయ్య, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వీపీఆర్ ఎన్నికల ప్రచారం

కందుకూరు/ఉలవపాడు : టీడీపీ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు, కందుకూరు మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గుడ్లూరులోని గుండా శ్రీనివాసులు కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో సమావేశం అవుతారని, అనంతరం మధ్యాహ్నం 2.30 ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. తదుపరి సాయంత్రం 5 గంటలకు కందుకూరు మండలం ఓగూరులో ప్రచారం చేస్తారని వారు తెలిపారు.